
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 7 మే 2024





ఆర్వోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

వైసీపీ శ్రేణుల.. హల్‌చల్



దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్తలు

నరసరావుపేట ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద ఉద్రిక్తత

- పోలీసుల సాక్షిగా టీడీపీ కార్యకర్తలపై వైసీపీ దాడి
- కారు ధ్వంసం.. పలువురికి గాయాలు ఆస్పత్రికి తరలింపు
- భయాందోళనతో ఓటు హక్కు వినియోగించుకోకుండానే వెనుతిరిగిన ఉద్యోగులు
- సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కారుపై దాడి

నరసరావుపేట, మే 6: పోలింగ్ సమయం దగ్గరపడుతుంది.. ప్రశాంత ఎన్నికలకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు అధికారులు ప్రకటిస్తున్నారు. స్వేచ్ఛాయుత ఓటింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారులు చెప్తున్నారు. కానీ పల్నాడులో మరోసారి వైసీపీ మూకలు బరి తెగించాయి. నరసరావుపేట పల్నాడు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ కేంద్రం వద్ద వైసీపీ శ్రేణులు హల్‌చల్ చేశాయి. వైసీపీ మూకలు కేంద్రాన్ని చుట్టుముట్టారు. పోలీసుల సాక్షిగా గంట పాటు కర్రలు.. రాళ్లతో వీరంగం వేశారు. పసుపు కండువ ధరించిన వారిని టార్గెట్ చేసి దాడిచేసి గాయపరిచాయి. భయభ్రాంతులకు గురైన కొందరు ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకోకుండానే వెనుతిరగాల్సి వచ్చింది. ఈ సంఘటలనతో పల్నాడు రోడ్డులో ఉద్రికత్త పరిస్థితుల నెలకొన్నాయి. సత్యనారాయణ రెడ్డి అనే విశ్రాంత ఆర్మీ ఉద్యోగి ఎస్ఎస్ఎన్ కళాశాలలోని ఫెసిలిటేషన్ కేంద్రానికి రాగా విశ్రాంత ఆర్మీ ఉద్యోగికి ఓటు ఉండదని అక్కడి అధికారులు చెప్పారు. ఆ తర్వాత ఆయన కేంద్రం వద్ద పోలీసులతో ముచ్చటిస్తున్నారు. ఆ సమయంలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అక్కడకు రాగా ఆయన కారును కేంద్రం లోపలికి అనుమతించలేదు. దీంతో వాదన మొదలుకావడం, అక్కడున్న సత్యనారాయణరెడ్డి మొబైల్ ఫోన్‌పై వైసీపీ స్టిక్కర్‌ను టీడీపీ కార్యకర్తలు గమనించి మందలించి ఆ స్టిక్కర్‌ను తొలగించారు. సత్యనారాయణరెడ్డిపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారన్న సమాచారం వైసీపీ అభ్యర్థి గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి తెలిసింది. దీంతో ఆయన తన అనుచరులతో కలసి కేంద్రంలోకి ప్రవేశించారు. సత్యనారాయణరెడ్డిపై దాడి జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ఆర్వో సరోజపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో కళాశాలకు ఎదురుగా ఉన్న వైసీపీ కార్యాలయం నుంచి కర్రలు, రాళ్లతో వచ్చిన వైసీపీ మూకలు కేంద్రం వద్దకు చేరి టీడీపీ శ్రేణులపై దాడులకు తెగబడ్డాయి. పసుపు కండువా ఉన్న వ్యక్తులే లక్ష్యంగా వారిపై దాడి చేసి గాయపరిచాయి. వైసీపీ మూకల దాడులతో కేంద్రం వద్ద ఓటు వేయడానికి వచ్చిన ఉద్యోగులతో పాటు పల్నాడు రోడ్డులోని సాధారణ ప్రజలు భయకంపితులయ్యారు.



దాడిలో ధ్వంసమైన కారు అద్దాలు

అదే సమయంలో అటు వైపు వెళ్తున్న సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కారుపై కర్రలతో వైసీపీ మూకలు దాడిచేశాయి. అద్దాలు ధ్వంసం చేసి కారు టైర్లలో గాలితీసేశారు. గంట పాటు ఇష్టం వచ్చినట్లుగా దాడులకు తెగబడుతున్నా అక్కడకు పోలీసులు ప్రేక్షక పాత్రకే పరిమితమ య్యారు. గాయపడిన టీడీపీ కార్యకర్తలను స్థానికులు ఆస్పత్రులకు తరలించారు.

వైసీపీ కార్యాలయం ఎదురుగానే బ్యాలెట్ కేంద్రం

పోస్టల్ బ్యాలెట్ కేంద్రం ఏర్పాటులో ఎన్నికల అధికారులు నిబంధనలు పాటించలేదు. ఏకంగా వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ కార్యాలయం ఎదురుగానే కేంద్రం ఏర్పాటు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక పార్టీ కార్యాలయం ఎదురు పోస్టల్ బ్యాలెట్ కేంద్రం ఎలా ఏర్పాటు చేశారన్న ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. అక్కడ ఎప్పుడూ వందలాది మంది వైసీపీ కార్యకర్తలు ఉంటారు. పార్టీ కార్యాలయం గేటు ఎదురుగానే బ్యాలెట్ కేంద్రం గేటు ఉంది. సదరు కార్యాలయంలో కర్రలు, రాళ్లు ఎందుకు ఉన్నాయి. ఇప్పటికైనా పోస్టల్ బ్యాలెట్ కేంద్రం మార్చాలని ఉద్యోగులు కోరుతున్నారు. లేకుంటే భారీగా భద్రత కల్పించాలంటున్నారు.



ఇప్పుడే ఇలా.. పోలింగ్ రోజు పరిస్థితి?

పోస్టల్ బ్యాలెట్ కేంద్రం వద్ద ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించడంలో యంత్రాంగం విఫలమైందనేందుకు సోమవారం నరసరావుపేటలో జరిగిన ఘటనే నిదర్శనం. ఓటు గుర్తింపు స్లిప్ ఉన్నవారిని, అభ్యర్థులు, వారి ఏజెంట్లను మాత్రమే కేంద్రంలోకి అనుమతించాల్సి ఉండగా ఇందుకు విరుద్ధంగా అధికారులు వ్యవహరించినందునే ఈ ఘర్షణ చోటు చేసుకుందన్న విమర్శలు వస్తున్నాయి. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహణలో యంత్రాంగం, పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించినందునే వైసీపీ మూకలు దాడులకు తెగబడ్డాయన్న విమర్శలున్నాయి. పరిమిత ఓటర్లు ఉండే ఈ పోస్టల్ పోలింగే ఇలా నిర్వహిస్తే 13న జరిగే అసలు పోలింగ్ పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భయాందోళనలు ఓటర్ల నుంచి వ్యక్తమవుతున్నాయి. పలు పోలింగ్ బూత్‌ల వద్ద ఇదేరకమైన దాడులకు తెగబడేందుకు వైసీపీ రంగం సిద్ధం చేసుకుంటుందన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ ఎలాంటి చర్యలు తీసుకుని ప్రశాంత ఎన్నికలు నిర్వహిస్తుందో చూడాలి.

అరాచకాలపై ఖండన


• శ్రీకృష్ణదేవరాయలు, అరవిందబాబు

ఓటమి భయంతోనే ఓటర్లను ఇబ్బంది పెట్టే అరాచక చర్యలకు వైసీపీ నేతలు పాల్పడుతున్నారని కూటమి నరసరావుపేట ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలిపారు. నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగస్తులు టీడీపీ వైపే ఉండడంతో వైసీపీ నేతల్లో భయం మొదలై ప్రశాంతంగా జరుగుతున్న బ్యాలెట్ ఓటింగ్ వద్ద అలజడి సృష్టించారన్నారు. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలోని పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలోకి నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ మూకలు ప్రవేశించి లోపలే సమావేశాలు పెట్టారన్నారు. దాదాపు 30 మందికి పైగా వైసీపీకి చెందిన వ్యక్తులు ఎన్నికల కాంపౌండ్ లోపలికి ప్రవేశించారన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి, ఆయన అనుచరులు టీడీపీ శ్రేణులపై దాడి చేయ డాన్ని ప్రజలు గమనించార న్నారు. ఈ ఘటనపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు ప్రశాంత ఎన్ని కలకు సహకరించాలని కోరారు. సమావేశంలో జనసేన నేత సయ్యద్ జిలానీ పాల్గొన్నారు.



- రాజకీయాలకు తావులేకుండా చేస్తా
- బాపట్ల అభివృద్ధికి ఐదేళ్ల పత్యేక ప్రణాళిక
- జిల్లాకు గుర్తింపుతో పాటు పరిశ్రమలు తీసుకొస్తా
- నాడు చంద్రబాబు నాయకత్వంలో ఎన్నో చేశా.. మళ్లీ చేస్తా
- ఆంధ్రజ్యోతితో బాపట్ల లోక్‌సభ కూటమి అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్

సేవ.. సంకల్పం



● తెన్నేటి కృష్ణప్రసాద్, బాపట్ల కూటమి ఎంపీ అభ్యర్థి

బాపట్ల, మే 6: ఐపీఎస్ అధికారిగా ప్రజలకు, పోలీసులకు మధ్య స్నేహ సంబంధాలు ఏర్పాటు చేశా. ఉద్యోగ విరమణ నుంచి ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. ప్రజలకు మరింతగా సేవలు అందించేందుకు రాజకీయరంగంలోకి అడుగుపెట్టాను. నాడు ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో పనిచేశాను. తిరిగి ఆయన నాయకత్వంలో ప్రస్తుతం బాపట్ల ఎంపీగా గెలిచి ప్రజలకు సేవ చేస్తాను. రాజకీయాలకు తావులేకుండా ప్రజలకు సేవలు అందించడంతో పాటు బాపట్ల ప్రాంతాన్ని ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి చేస్తాను.. అని కూటమి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. బాపట్ల లోక్‌సభ పరిధిలో పరిశ్రమలు తీసుకొచ్చి లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే తన లక్ష్యమన్నారు. యువతకు ఉపాధి కల్పించి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు నమ్మకం ఉంచి గెలిపిస్తే వారిలో ఒకరిగా కలిసి జీవిస్తానన్న తెన్నేటి ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్న కృష్ణప్రసాద్ వివిధ అంశాలపై తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే..

హైదరాబాద్ అభివృద్ధిలో భాగస్వామ్యం

ఉమ్మడి రాష్ట్రంలో 1999-2004 మధ్య ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఈడీగా పనిచేసిన సమయంలో హైదరాబాద్ హైటెక్ సిటీ, ఔటర్ రింగ్‌రోడ్డు, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, సైబరాబాద్ నిర్మాణం వంటివి చేపట్టాను.చంద్రబాబు విజన్, దూరదృష్టితో ఇంతటి అభివృద్ధి చేయగలిగాం. అదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమరావతిని మంచి రాజధానిగా అభివృద్ధి చేసి పరిశ్రమలు తీసుకొచ్చి 5 లక్షల మందికి ఉద్యోగవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తాను.

నాన్‌లోకల్ ప్రచారంపై ..

నేను పుట్టింది గోదావరి జిల్లా. పెరిగింది కృష్ణా పరివాహక ప్రాంతం. హైదరాబాద్‌లో చదివాను. అంత మాత్రాన నాన్‌లోకల్ ఎలా అవుతాను. నెల్లూరు, కర్నూలు, గుంటూరు, విజయవాడ, ఈస్ట్‌గోదావరి, విశాఖలో ఏఎస్పీగా, ఎస్పీగా, ఐజీగా ప్రస్థానం కొనసాగించాను. బాపట్లలోనే ఉంటా బాపట్ల ప్రజల సంక్షేమం కోసం పని చేస్తా. విద్యావంతుడిగా ఈ ప్రాంతానికి ఏమి చేయాలో అవగాహన ఉంది. పార్లమెంట్‌లో బాపట్ల వాణి వినిపించి ఈప్రాంత అభివృద్ధికి కృషి చేస్తా.

ప్రచారం.. అనుభవాలు

ఎన్నికల ప్రచారంలో బాపట్ల ప్రాంత ప్రజలు నీరజనాలు పలుకుతున్నారు. విజయం కోసం కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున కృషి చేస్తున్నారు. ప్రజల అభిమానం చూస్తుంటే గెలుపు నా దేననే ధీమా ఉంది. ప్రజలు నుంచి మంచి స్పందన వస్తున్నది. చెప్పినవన్నీ చేయడానికి నా గెలుపు ఎంతో ముఖ్యం. బాపట్ల ప్రాంత ప్రజలు నన్ను గెలిపించి తీరుతారనే సంపూర్ణ విశ్వాసం ఉంది.

ఫౌండేషన్ సేవలు

మూడున్నర దశాబ్దాల పాటు పోలీసు అధికారి గా ప్రజలకు సేవలందించా ను. ఉద్యోగ విరమణ తర్వాత కేపీ, మలుపు ఫౌండేషన్లు ఏర్పాటు చేసి లక్షలాది మంది ప్రజలకు సేవలందించాను. కోవిడ్ సమయంలో ప్రజల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాను. ఇప్పటికీ ఫౌండేషన్ ద్వారా సేవలందిస్తాను. రాజకీయ నాయకుడిగా గెలిచి సేవలు మరింతగా విస్తరించేందుకు కృషి చేస్తాను.

అభివృద్ధి.. ఉపాధి

చీరాలలో చేనేత కార్మికుల కోసం టెక్స్‌టైల్ పార్క్ తీసుకొచ్చి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొస్తాను. బాపట్ల-చీరాలలో హైటెక్ టూరిజం ప్రాజెక్ట్ తీసుకురావడంతో పాటు చిత్ర పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తా. పర్చూరు-అద్దంకిలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తా. వేమూరు, సంతనూతలపాడు లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు నెలకొల్పి యువతలో నైపుణ్యాలు పెంపొందించేందుకు కృషి చేస్తా. నిజాంపట్నం తీరంలో పోర్టు నెలకొల్పడంతోపాటు చీరాల ఓడరేవులో ఫిషింగ్ హార్బర్‌ను ఏర్పాటు చేయిస్తా. బాపట్ల ప్రాంతంలో విద్యా వ్యాప్తికి కృషి చేస్తాను. వ్యవసాయ, ఇంజనీరింగ్ విద్యలకు అనుబంధంగా ఉన్నత విద్యను తీసుకొచ్చి విద్యార్థుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తాను.

ఐదేళ్ల ప్రణాళిక

బాపట్లలోనే నివాసం ఉండి ఈ ప్రాంత ప్రజలకు మేలు చేసేలా ప్రణాళికను రూపొందిస్తా. కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకుని పరిశ్రమలు, టూరిజం, ఫిల్మ్ ఇండస్ట్రీ వంటివి తీసుకొచ్చి బాపట్ల యువత కు ఉపాధి కల్పిస్తాను. గతంలో గంగవరం, కృష్ణపట్నం పోర్టుల నిర్మాణానికి కృషి చేశాను. అదే అనుభవంతో నిజాంపట్నం పోర్టు, ఓడరేవు ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు కృషి చేస్తాను. 10వేల కోట్లతో పోర్టు నిర్మాణం చేస్తే లక్ష కోట్ల పెట్టుబడులు వస్తాయి. తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. బాపట్ల పార్లమెంట్‌లో విస్తారంగా ఉన్న తీరప్రాంతంలో జెట్టీల నిర్మాణం చేపడుతాం. కొత్తపరిశ్రమలు నెలకొల్పడం ద్వారా పెట్టుబడులు పెరుగుతాయి. బాపట్లను ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేస్తాను. బయో టెక్‌సిటీ ఏర్పాటుకు కృషి చేస్తాను. ఐటీ టవర్ కడతాం. చేనేత కార్మికులు, దేవాంగుల కొరకు అంతర్జాతీయ డిజైన్‌తో పేటెంట్ కల్పించి ఇంటర్నేషనల్ మార్కెట్‌లో ప్రవేశం కల్పించి ఉపాధి అవకాశాలు పెంచుతాను. సంతనూతలపాడు, చీమకుర్తి, అద్దంకిలలో గ్రానైట్ కారిడార్ ఏర్పాటు చేస్తాను.

పోస్టల్ బ్యాలెట్‌కు పైసలు



- ఉద్యోగుల ఓట్లకు యమ డిమాండ్
- కొనుగోళ్లలో అధికార వైసీపీ అభ్యర్థులు
- రూ.2 వేల నుంచి రూ.7 వేల వరకు ఆఫర్
- ఉదయం నుంచే కేంద్రాల వద్ద నేతల అనుచరుల తిష్ఠ
- యూనియన్ నేతల ద్వారా ఉద్యోగుల ప్రసన్నానికి ప్రయత్నాలు
- ఐదేళ్లుగా జరిగిన అన్యాయంపై నేతలను నిలదీస్తున్న ఉద్యోగులు

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇప్పటికే పీవో, ఏపీవో, మైక్రో అబ్జర్వర్లు తమ ఓటుహక్కుని వినియోగించుకున్నారు. అయితే వీరి సంఖ్య తక్కువగానే ఉన్నది. ఎన్నికల విధుల్లో అత్యధిక సంఖ్యలో ఉండే పోలీసులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య శాఖ, సచివాలయాల సిబ్బందితో పాటు కాంట్రాక్టు ఉద్యోగులకు మంగళ, బుధవారాల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించేందుకు అవకాశం ఇచ్చారు. నియోజకవర్గాల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు బారులు తీరారు. ఉద్యోగుల్లో ఎక్కువమంది ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న దృష్ట్యా వీరి ఓట్లపై వైసీపీ అభ్యర్థులు దృష్టి పెట్టారు. ఎలాగైనా ఉద్యోగులను ప్రసన్నం చేసుకుని వారి ఓటును తమకు అనుకూలంగా వేయించుకునేందుకు డబ్బు రూపంలో ప్రలోభ పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఆ రేటు రూ.2 వేల నుంచి రూ.7 వేల వరకు ఇచ్చేందుకు అభ్యర్థులు ముందుకు వచ్చారంటే పోస్టల్ బ్యాలెట్‌కు ఏ స్థాయిలో డిమాండ్ ఉందో తెలుస్తోంది. ఉద్యోగులను అనుకూలం చేసుకునేందుకు మరికొందరు ఉద్యోగ సంఘ నేతలను సంప్రదించి బేరసారాలకు తెరలేపారు. ఉద్యోగులు వైసీపీకి వ్యతిరేకంగా ఉన్నారనే అంచనాల నేపథ్యలో వారికి ఓటుకు రూ.5,000 చెల్లించాలని తాడేపల్లి పెద్దలు అభ్యర్థులకు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. నేతల అనుచరులు పోస్టల్ బ్యాలెట్ కేంద్రాల దగ్గరే మకాం వేసి ఉద్యోగులను ప్రలోభపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రలోభాలపై టీడీపీ నేతలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంపై విమర్శలకు తావిస్తోంది. మరోవైపు గంపగుత్తగా ఉద్యోగుల ఓట్ల కొనుగోలుకు యూనియన్ నేతల ద్వారా వైసీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే యూనియన్ నేతలతో పాటు, పలువురు ఉద్యోగుల నుంచి బేరసారాలపై తిరస్కారమే ఎదురవుతుంది. ఐదేళ్లుగా వైసీపీ పాలనలో తమకు జరిగిన అన్యాయంపై నేతలను ఉద్యోగులు నిలదీయడం మొదలుపెట్టారు. తమ ప్రయోజనాలకు ప్రభుత్వం గండికొట్టి ఇప్పుడొచ్చి డబ్బు ఆశచూపితే మోసపోవడానికి తాము సిద్ధంగా లేమని తిరస్కరిస్తున్నారు. దీంతో వైసీపీ అభ్యర్థులు, నేతల్లో కలవరం మొదలైంది.

◆ బాపట్లలో సోమవారం మున్సిపల్ హైస్కూల్‌కు సమీపంలోని ఓ హోటల్‌లో వైసీపీ నేతలు పోస్టల్ బ్యాలెట్‌లకు డబ్బులు పంచుతున్నారన్న సమాచారంతో పోలీసులు తనిఖీలకు వెళ్లగా అప్పటికే అక్కడ నుంచి పలాయనం చిత్తగించారు. రేపల్లెలో వైసీపీ ఓటుకు రూ.2 వేలు పంపిణీ చేసినట్లు సమాచారం.

◆ గుంటూరు జిల్లాలో దాదాపుగా 20,775 మందికి పోస్టల్ బ్యాలెట్ ఉంది. దీంతో ఎక్కువ ఓట్లు పొందేందుకు వైసీపీ అభ్యర్థులు ప్రలోభాలకు తెరలేపారు. జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో మంగళగిరిలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కీలకంగా మారాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని వైసీపీ అభ్యర్థులు ఓటుకు అత్యధికంగా రూ.5 వేల చొప్పున పంచుతున్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ, తెనాలి, ప్రత్తిపాడు, పొన్నూరులో రూ.2 వేలు, తాడికొండలో రూ.1,500 పంచుతున్నారని సమాచారం.

◆ పల్నాడు జిల్లాలో 19,095 మంది ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్‌లు జారీ చేశారు. వీరిలో 16,582 మంది జిల్లాలో విధులు నిర్వ హిస్తూ జిల్లాలోనే ఓటు హక్కు కలిగినవారు ఉన్నారు. ఈ సారి పోస్టల్ బ్యాలెట్ అత్యధికంగా పెదకూరపాడు నియోజకవర్గంలో రూ.7 వేలకు వైసీపీ అభ్యర్థి నంబూరు శంకర రావు కొనుగోలు చేసినట్లు తెలిసింది. తదుపరి మాచర్లలో రూ.5 వేలకు పిన్నెల్లి కొనుగోలు చేసినట్లు సమాచారం. ఇతర నియోజకవర్గాల్లో కనీసం రూ.3 వేలకు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

మనసంతా చేనేత

- మోదీని చేనేత కండువాతో సత్కరించిన లోకేశ్
- హర్షం వ్యక్తం చేస్తున్న మంగళగిరి చేనేతలు

మంగళగిరి, మే 6: ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎక్కడ పర్యటిస్తున్నా... ఆయన మనసంతా మంగళగిరి.. చేనేతలతోనే ఉందనేందుకు సోమవారం జరిగిన ఘటనే ఉదాహరణ. మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న లోకేశ్ వారం రోజులుగా యువగళం సభలతో బిజీగా ఉంటున్నారు. తాజాగా సోమవారం రాజమహేంద్రవరంలో జరిగిన ప్రధాని నరేంద్రమోదీ సభలో మంగళగిరి చేనేతకు పెద్దపీట వేశారు. ప్రధాని మోదీకి మంగళగిరి చేనేత కండువాను కప్పి సత్కరించి చేనేతలపై తన ప్రేమను లోకేశ్ చాటుకున్నారు. తమపై లోకేశ్ చూపుతున్న అభిమానం, ప్రత్యేక శ్రద్ధపై మంగళగిరి చేనేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి చేనేతలకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించి, ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చాలన్న ఉద్దేశంతో మంగళగిరిలో లోకేశ్ వీవర్‌శాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆధునిక మగ్గాలపై చేనేతలకు శిక్షణ ఇవ్వడంతో పాటు టాటా సంస్థతో ఒప్పందం చేసుకుని, మంగళగిరి చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. మంగళగిరిలో ప్రస్తుతం సుమారు వెయ్యిలోపు ఉన్న చేనేత మగ్గాలను ఐదు వేలకు పెంచి చేనేతల జీవన స్థితిగతులను మెరుగుపరచడమే లక్ష్యమని ప్రకటించి ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందుకు లోకేశ్‌తల్లి భువనేశ్వరి, భార్య బ్రాహ్మణి సైతం తమ వంతు సహకారం అందిస్తున్నారు.



ప్రధాని మోదీకి చేనేత కండువాను కప్పుతున్న నారా లోకేశ్

వైసీపీ నేతల బరితెగింపు

● ఎన్నికల కోడ్ ఉల్లంఘన ● రహదారి నిర్మాణానికి మట్టితరలింపు



దాచేపల్లి 1వ వార్డులో రహదారి నిర్మాణానికి తోలిన మట్టి

దాచేపల్లి, మే 6: దాచేపల్లిలో యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరుగుతోంది. రహదారి నిర్మాణంకోసం ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. పోలీసు, నగరపంచాయతీ కమిషనర్, స్పెషల్ స్క్వాడ్ బృందాలకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చినా ఎటువంటి సమాధానం ఇవ్వలేదని టీడీపీ నేతలు ఆరోపించారు. వివరాల్లోకి వెళ్తే దాచేపల్లి నగర పంచాయతీలోని 1వ వార్డు పరిధిలో దూదేకుల వారి బజారులో రహదారి నిర్మాణానికి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించి రోడ్డుపై పోసి చదునుచేస్తున్నారు. దీనికితోడు 1,2,3 వార్డుల్లో పనిచేస్తున్న కొంతమంది వలంటీర్లు ఇంటింటికి తిరిగి వైసీపీ వస్తేనే ప్రభుత్వ పథకాలు కొనసాగుతాయని, టీడీపీ వస్తే పథకాలు నడవవని ప్రజలను మభ్యపెడుతున్నారని స్థానికుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ఇదే విషయంపై స్థానిక టీడీపీ నేతలు వలంటీర్లను ప్రశ్నిస్తే తాము రాజీనామా చేశామంటూ దురుసుగా సమాధానం చెబుతున్నారు. ఎవరు రాజీనామా చేశారో లిస్టు కావాలని ఎంపీడీఓను వివరాలు అడిగితే ఆ వివరాలు కూడా మాకు చెప్పడం లేదని టీడీపీ నేతలు పేర్కొన్నారు. వైసీపీ నేతలకు ఒక నీతి, టీడీపీ నేతలకు మరొక నీతిగా మారిందని స్థానికుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి.

జగన్‌ను ఇంటికి పంపేందుకు మాదిగలు సిద్ధం

● ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులన్నీ దారి మళ్లించారు

● ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్

దాచేపల్లి, మే 6: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపించేందుకు మాదిగలంతా సిద్ధంగా వున్నారని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ తెలిపారు. సోమవారం దాచేపల్లిలోని టీడీపీ కార్యాలయంలో సురేష్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అరాచకత్వం, అక్రమాలు మినహా అభివృద్ధి జాడేలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులన్నీ దారి మళ్లించారని ఆరోపించారు. మాదిగలకు ఎస్సీ వర్గీకరణ ముఖ్యమని, దీనికి జగన్మోహన్‌రెడ్డి వ్యతిరేకమని తెలిపారు. ఇంటింటికి తాగునీటి పైపులు ఇస్తామన్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వేసవిలో గుక్కెడు నీరు లభించక దళిత బిడ్డలు ఇబ్బంది పడుతుంటే ట్యాంకర్ల ద్వారా నీటిని పంపించడం కూడా కష్టంగా వుందని ఫిర్యాదు చేశారు. రానున్న ఎన్నికలలో మాదిగలంతా సంఘటితమై వైసీపీని ఓడించాలని, టీడీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాతంగి సత్యానందం, బాబు మాదిగ, కోటేశ్వరి, చిలుముల దుర్గారావు, సుందరరావు, వేల్పుల ముత్తయ్య, పత్రా విజయ్ పాల్గొన్నారు.

మద్యం, నగదు సీజ్

గుంటూరు(తూర్పు), మే6: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా మంగళగిరి, తెనాలి, తాడికొండ నియోజకవర్గ పరిధిల్లో రూ.3,05,400, రూ.1,00,000 నగదు, గుంటూరు తూర్పులో రూ.34,110 నగదు, రూ.7,480 విలువగల 10.7 లీటర్ల మద్యం సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. మే 6వ తేది సాయంత్రం 6 గంటల వరకు రూ.3,17,17,881 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమిని ఆశీర్వదించండి

● ఐదేళ్లు అండగా నిలబడతాం

● శ్రీకృష్ణదేవరాయలు, అరవింద్ బాబు



రావిపాడు ఎన్నికల ప్రచారంలో లావు శ్రీకృష్ణ దేవరాయలు, అరవిందబాబు

నరసరావుపేటరూరల్, మే6: రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎన్డీఏ కూటమి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న తమని ఆశీర్వదిస్తే ఐదేళ్లు అండగా నిలబడతామని నరసరావుపేట ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు లావు శ్రీకృష్ణ దేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. సోమవారం నరసరావుపేటరూరల్ మండలంలోని.. రావిపాడు, అల్లూరివారిపాలెం, అరవపల్లి, పెట్లూరివారిపాలెం, కాకాని, కోటప్పకొండ, యక్కలవారిపాలెం, గోనెపూడి, చింతలపల్లి, యలమంద గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రేపు జరగబోయే మంచిని మాత్రమే గుర్తుంచుకోవాలని, ఎటువంటి ప్రలోభాలకు లొంగొద్దని, భయభ్రాంతులకు గురవద్దని కోరారు. పల్నాడులో రైతులకు మేలు జరగాలంటే గోదావరి జలాలను సాగర్ కుడికాల్వకు తెచ్చుకోవాలని, ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే చంద్రబాబునాయుడు శంకుస్థాపన కూడా చేశారని అన్నారు. జల్‌జీవన్‌మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ నీరు అందించేందుకు పల్నాడుకి రూ.500 కోట్లు మంజూరు అయ్యాయని, తాము అధికారంలోకి రాగానే.. నిధులు సమర్థంగా వినియోగించుకొని ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో పేదవాని జీవన దశ దిశ మార్చబోతున్నామని అన్నారు.

బీసీలను ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్తాం..



బీసీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న లావు శ్రీకృష్ణ దేవరాయలు

బీసీ సామాజికవర్గానికి గడిచిన ఐదేళ్లలో పదవులు అలంకారానికేతప్ప, అధికారాలు శూన్యమని కూటమి నరసరావుపేట ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవింద బాబు, జనసేన ఇన్‌చార్జి సయ్యద్ జిలాని అన్నారు. సోమవారం నరసరావుపేట మండలం, రావిపాడు గ్రామంలో యాదవుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ బీసీల పార్టీ అని, గడిచిన కాలంలో వారి సంక్షేమాన్ని కృషిచేసింది టీడీపీయేనని అన్నారు. బీసీ కార్పొరేషన్లకు పూర్వ వైభవం తీసుకొస్తామని, నిధులు కేటాయించి, వారికి సముచిత గౌరవాలు కల్పిస్తామని అన్నారు. బీసీ డిక్లరేషన్ రక్షణ చట్టంతో వారికి కవచంలా పనిచేస్తామని అన్నారు. గడిచినకాలంలో పల్నాడులో బీసీలపై దాడులు జరిగాయని, చంద్రయ్యను అమానుషంగా హత్యచేసిన ఘటనలు చూసామని.. ఇలాంటి పరిస్థితులను మార్చి ప్రశాంత వాతావరణాన్ని తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

మా ఓటు ఎక్కడ?

● గందరగోళంలో పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు

● బ్యాలెట్ పంపలేదంటూ సొంత నియోజకవర్గంలోనే వేయాలని ఆర్వో వెల్లడి



ఓటు వేసేందుకు వచ్చిన పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు

పెదకూరపాడు, మే 6: పెదకూరపాడులో సోమవారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగింది. సుమారు 50 నుంచి 70 మంది ఓటర్లు ఓటు వేయకుండానే వెనుదిరిగి వెళ్ళారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ఉద్యోగాలు చేస్తూ వివిధ జిల్లాలకు చెందిన వారికి పెదకూరపాడులోని జడ్పీ హైస్కూల్లో ఓటు వేసేందుకు అవకాశం ఉందని తొలుత సంబందిత అధికారులు వివరించారు. సుదూర ప్రాంతాల నుంచి మండు వేసవిలో ఓట్లు వేసేందుకు గంటల తరబడి బారులు తీరి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఫారాలు పూర్తి చేసి బ్యాలెట్ తీసుకోబోయే సమయానికి మీ ఓటు ఉన్న నియోజవర్గం నుంచి రిటర్నింగ్ అధికారి మీ బ్యాలెట్ పంపించలేదని, మీకు ఓటు ఉన్న నియోజక వర్గం వెళ్ళి ఓటు వేసుకోవాలని సంబంధిత అధికారులు చెప్పారు. 5వతేదీ కొంత మంది ఓటర్లు గుంటూరు, మంగళగిరి తదితర ప్రాంతాల్లో ఓట్లు వేసేందుకు క్యూలో గంటల తరబడి ఉండి తీరా ఓటు వేసే సమయానికి ఇక్కడ కాదు మీరు ఓట్లు వేసేది మీరు ఉద్యోగంచేసే చోటే వేయాలని చెప్పటంతో సోమవారం పెదకూరపాడు వచ్చినట్లు పలువురు ఆంధ్రజ్యోతికి తమ బాధను వెలుబుచ్చారు. ఈ ఓటర్లలో గర్భిణిలు కూడా ఉన్నారు. వారి ఓటు సొంత నియోజక వర్గంలోనా లేక ఉద్యోగం చేసే పెదకూరపాడు నియోజక వర్గంలోనా అనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు.

232 మంది హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన



యాత్రికుడికి వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

గుంటూరు (మెడికల్), మే 6: గుంటూరు, బాపట్ల జిల్లాల నుంచి హజ్ యాత్రకు వెళుతున్న 232 మంది ముస్లిం యాత్రికులకు సోమవారం గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి శుశృతహాల్‌లో ప్రత్యేక వ్యాక్సినేషన్ శిబిరం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మీ శిబిరాన్ని సందర్శించి వ్యాక్సినేషన్ నిర్వహణలో వైద్య సిబ్బందికి తగిన సూచనలు చేశారు. గుంటూరు, బాపట్ల జిల్లాల వ్యాధి నిరోధక టీకాల అధికారులు డాక్టర్ కేవీ సుబ్బరాజు, డాక్టర్ టీ వెంకటేశ్వర్లు శిబిరాన్ని పర్యవేక్షించారు.



సమావేశంలో బీసీ నేతలతో కలసి ఐక్యత చాటుతున్న, కేశన శంకరరావు

వైసీపీ పాలనలో బీసీలపై పెరిగిన దాడులు

● కూటమి అభ్యర్థుల విజయానికి బీసీ సంఘాలు కృషి

పొన్నూరుటౌన్, మే6: వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో బీసీలపై దాడులు, దౌర్జన్యాలు, విచ్చలవిడిగా పెరిగాయని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు ఆరోపించారు. సోమవారం చింతలపూడి డీవీసీ కళ్యాణ మండపంలో బీసీ సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. బీసీ సంఘాలు కూటమి అభ్యర్థుల విజయానికి పాటుపడాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో శంకరరావు మాట్లాడుతూ ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, పెమ్మసాని చంద్రశేఖర్‌ల విజయానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బడుగు బలహీన వర్గాలపై దాడులు దౌర్జన్యాలు పెరిగాయన్నారు. చెరుకుపల్లి వద్ద అమర్నాద్ గౌడ్ అనే బాలుడు, పల్నాడులో చంద్రయ్య హత్యలు అత్యంత కిరాతకమని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల యువత అధ్యక్షుడు కె.క్రాంతి కుమార్, అన్నం నాగమల్లేశ్వరరావు, బొర్రు రామారావు, తోట నాగరాజు, షేక్ షఫ్రూద్, బొర్రు సాంబశివరావు తదితర బీసీ నేతలు పాల్గొన్నారు.

భార్యను రోకలిబండతో కొట్టి చంపిన భర్త

పెదకాకాని, మే6: భార్యను రోకలిబండతో కొట్టి హతమార్చిన ఘటన మండలంలోని తక్కెళ్ళపాడు ఎస్సీ కాలనీలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన పెనుమాల ఏడుకొండలు, అంజమ్మ (45) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు. ఏడుకొండలు కొద్దికాలంగా భార్య ప్రవర్తనపై అనుమానంగా ఉంటూ గొడవపడేవాడు. ఈ క్రమంలో ఆదివారం భార్యాభర్తల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో ఏడుకొండలు రోకలి బండతో అంజమ్మ తలపై కొట్టాడు. తీవ్ర రక్తస్రావమైన ఆమె అక్కడ పడిపోయింది. కొద్ది సమయానికి తన కొడుకు విజయ్ ప్రకాష్ వచ్చి గమనించగా తల్లిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. మార్గమధ్యంలోనే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఏడుకొండలు పోలీస్ స్టేషన్‌కి వెళ్లి లొంగి పోయినట్లు తెలిసింది.

దాడులతో భయపడబోం..

● ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు బ్రహ్మారెడ్డి పరామర్శ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న బ్రహ్మారెడ్డి

మాచర్లటౌన్, మే 6: పిన్నెల్లి సోదరులు మాచర్ల పట్టణంలో రౌడీ మూకలను ఉసిగొల్పి టీడీపీ నేతలపై దాడులు చేయిస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి వైసీపీ రౌడీమూకల దాడిలో గాయపడి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న మాజీ కౌన్సిలర్ మంజుల వెంకటేశ్వర్లు కుమారుడు కేశవను ఆయన పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్‌ను జరగకుండా అడ్డుకోవాలనేది వారి వ్యూహమన్నారు. ప్రజలంతా వారి దుర్మార్గానికి వ్యతిరేకంగా ఓట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ముందస్తు వ్యూహంలో భాగంగా పోలింగ్ శాతం తగ్గించేందుకు వైసీపీ నేతలు కుట్రలు పన్నుతూ వరుస దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా ప్రజలు కచ్చితంగా కూటమి అభ్యర్థులకు ఓటు వేసి ఈ దుర్మార్గాలకు చరమగీతం పాడతారన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు మాట్లాడుతూ దాడులకు వెరసేది లేదని, నమ్ముకున్న వారి కోసం తాము అండగా ఉంటామని అన్నారు. పరామర్శించిన వారిలో జూలకంటి శ్రీనివాసరెడ్డి, యెనుముల కేశవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, బండారు నాగేశ్వరరావు, బండ్ల శ్రీను, కొమెర శివ, జల్లెల కొండలు తదితరులు ఉన్నారు.

ఐదుకోట్ల మంది ఆత్మగౌరవం అమరావతి

● 1602వ రోజుకు రైతుల ఆందోళనలు



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, మే 6: ఎడారి, శ్మశానం, ముంపు అంటూ వైసీపీ పాలకులు రాష్ట్ర రాజధాని అమరావతిపైన విషం చిమ్మారని అటువంటి పార్టీ ఓటు వేయవద్దని రాజధాని నిర్మాణానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు రాష్ట్ర ప్రజలను వేడుకున్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, మూడు రాజధానులు వద్దు అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు నిరసన దీక్షలు సోమవారం నాటికి 1602వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు, మహిళలు మాట్లాడారు. ఐదు కోట్ల మంది ఆంధ్రుల ఆత్మ గౌరవమే అమరావతి అని స్పష్టం చేశారు. వైసీపీని శాశ్వతంగా ఇంటికి పంపితేనే రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి రాజధాని గ్రామాల్లో నినాదాలు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	150, 159,170
చికెన్ విత్ స్కిన్	286.00
చికెన్ స్కిన్ లెస్	296.00

మద్యం కేసుల వివరాలు..

మా ఇష్టం వచ్చినపుడు చెబుతాం

● సమాచారం అడిగినందుకు విలేకరులపై సెబ్ సీఐ దురుసు ప్రవర్తన





విలేకరులపై దురుసుగా ప్రవర్తిస్తున్న సెబ్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ రవికుమార్

గురజాలటౌన్, మే 6: సెబ్ స్టేషన్ గురజాల పరిధిలో ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం అమ్ముతూ లేదా పంపిణీ చేస్తూ పట్టుబడుతున్న కేసుల వివరాలు మీడియాకు ఎందుకు తెలపడం లేదని సోమవారం గురజాల సెబ్ సీఐ వెంకటరమణను విలేకరులు ప్రశ్నించారు. తమకు వచ్చినప్పుడు లేదా కుదిరినప్పుడు సమాచారం ఇస్తామంటూ సీఐ వెంకటరమణ విరుచుకుపడ్డారు. మీడియాకు చెప్పేంత సమయం లేదు.. సమయం వచ్చినప్పుడు చెబుతాం అంటూ ఆగ్రహించారు. అక్కడే ఉన్న ఎస్ఐ రవికుమార్ కూడా విలేకరులపై దురుసుగా మాట్లాడుతూ అసలెందుకు సమాచారం చెప్పాలంటూ కన్నెర్ర చేశారు. గురజాల సెబ్ కార్యాలయం వైసీపీ నేతలతో ఎప్పుడూ కిటకిటలాడుతోంది. రోజూ వైసీపీ నేతలు సెబ్ కార్యాలయానికి ఎందుకు వస్తున్నారు.. అక్రమ మద్యం కేసులో పట్టుబడిన వారిని రక్షించడానికే వస్తున్నారంటూ విమర్శలు వెలువెత్తుతున్నాయి. స్టేషన్ పరిధిలో వందల కొద్దీ మద్యం బాటిళ్ల పట్టుకున్నా మీడియాకు సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచుతున్నారు. మద్యం పట్టుకొని లంచాలు తీసుకొని వదిలేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పట్టుబడిన అక్రమ మద్యం కేసు వివరాలను గోప్యంగా ఉంచిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

73,776 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 78,010 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 73,776 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 52,483 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	18000
నెంబరు. 5	9000	12000
273	12500	13000
341	8500	16000
4884	9000	14500
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	9000	16000
దేవనూరు డీలక్స్	9000	16000
తెల్లకాయలు	5000	11500

హెలీప్యాడ్‌ను ధ్వంసం చేసినవారు కాపు ద్రోహులే ..



మాట్లాడుతున్న టీడీపీ కాపు సంఘం నాయకులు

పొన్నూరుటౌన్, మే6: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పొన్నూరు పర్యటనను అడ్డుకోవటానికి హెలిప్యాడ్‌ను తవ్వి ధ్వంసం చేసిన వారు కాపు ద్రోహులేనని కాపు సంఘం నాయకుడు మండిపడ్డారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ వైసీపీ మూకలు అడ్డంకులు సృష్టించాలని ప్రత్నించటం దారుణం అన్నారు. అయినప్పటికి జనసైనికులు టీడీపీ, బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పవన్ కళ్యాణ్ పర్యటనను విజయవంతం చేయటం వైసీపీకి చెంపపెట్టు అన్నారు. అంబటి మురళీ, కిలారి రోశయ్య కాపులను మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కాపు ముసుగులో వచ్చిన మోసగాళ్లను దరిచేరనీయవద్దని ప్రజలను హెచ్చరించారు. కాపు కులాన్ని అడ్డంపెటుకొని రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు. సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఆకుల సాంబశివరావు, యరసారి శ్రీరామ మూర్తి, తోట ప్రసాద్, కత్తుల రవి కిరణ్, రాజేష్, తోట శ్రీను, సాయిబాబు, సాయికుమార్ పాల్గొన్నారు.

హత్య కేసులో భార్య, ప్రియుడు సహా నలుగురు అరెస్టు

● వివాహేతర సంబంధంతో ఘాతుకం ..



హత్య కేసు నిందితులు

గుంటూరు, మే 6: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో ప్రియుడు, అతని అనుచరులతో కలసి భార్య కట్టుకున్న భర్తనే కడతేర్చింది. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టుచేసి, రిమాండుకు తరలించారు. ఈ మేరకు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొత్తపేట సీఐ అన్వర్ బాషా నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు వెల్లడించారు.

ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం ఆర్.ఉమ్మడివరం గ్రామానికి చెందిన కుక్కమూడి ప్రేమ్ కుమార్(35) తన భార్యా పిల్లలతో బతుకుతెరువు నిమిత్తం గుంటూరు వచ్చి బుచ్చయ్యతోట ఒకటో లైన్‌లో నివాసం ఉంటున్నాడు. అతను మార్కెట్లో పండ్ల వ్యాపారం చేస్తూ ఉండేవాడు. అతని భార్య భారతి సమోసాలు తయారు చేసే షాపులో పనికి వెళుతుంటుంది. ఈ క్రమంలో సదరు షాపు యజమాని షేక్ గౌస్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం భర్త ప్రేమ్‌కుమార్‌కు తెలిసింది. దీంతో ప్రేమ్‌కుమార్‌కు, భారతికి మధ్య గొడవలు జరుగుతున్నాయి. తమ వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని, ఆయనను అడ్డు తొలగించుకోవాలని భార్య భారతి భావించింది. దీంతో ప్రియుడు గౌస్‌తో కలసి భర్త ప్రేమ్‌కుమార్ హత్యకు పథకం రూపొందించింది. దీనిలో భాగంగా గౌస్, తన తమ్ముడు ఖాసిం, అతని స్నేహితుడు రెహ్మాన్‌లు కలసి ప్రేమ్‌కుమార్‌ను హత మార్చాలని నిర్ణయించుకున్నారు. గత నెల 28న రాత్రి మాయమాటలు చెప్పి కొర్నెపాడు పరిధిలో ఉన్న జగనన్న కాలనీ అర్బన్ లే అవుట్ వద్దకు తీసుకువెళ్ళి అక్కడ ప్రేమ్ కుమార్‌కు మద్యం త్రాగించి, అనంతరం ఒక కర్ర తో అతనిని వెనుక నుండి కొట్టి, తరువాత వారి వెంట తెచ్చుకున్న కత్తులతో ప్రేమ్ కుమార్ గొంతు కోసి చంపారు తరువాత భారతితో తన భర్త కనబడటం లేదని కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇప్పించారు. దీంతో ప్రేమ్‌కుమార్ మృతదేహాన్ని గుర్తుపట్టి, పంచనామా చేసి, హత్యకు ఉపయోగించిన ఆయా ఆయుధాలను స్వాధీన పరచుకున్నట్లు సీఐ అన్వర్‌బాషా తెలిపారు. దర్యాప్తు అధికారి అయిన ట్రాఫిక్ డీఎస్పీ వివి నాయుడు ఆధ్వర్యంలో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ అన్వర్ బాషా తెలిపారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



మహిళల ఉన్నతి, ఔన్నత్యం కోసం బాబును మళ్ళీ రప్పిద్దాం అనే బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న మహిళానాయకులు

బాబును మళ్లీ రప్పిద్దాం.. బాపట్లను అభివృద్ధిని చేసుకుందాం

● వేగేశన నరేంద్రవర్మ సతీమణి హరికుమారి

బాపట్ల, మే 6 : మహిళల ఉన్నతి, ఔన్నత్యం కోసం బాబును మళ్లీ రప్పిద్దాం..... బాపట్లను అభివృద్ధి చేసుకుందామని తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ సతీమణి వేగేశన హరికుమారి పిలుపునిచ్చారు. బాపట్ల కమ్మకళ్యాణ మండపంలో సోమవారం ఈ విషయమై మహిళా సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి టీడీపీ,జనసేన, బీజేపీ మహిళనాయకులు పెద్దఎత్తున హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి హరికుమారి మాట్లాడుతూ మహిళాభ్యున్నతి కోసం పాటుపడే చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. మహిళలంతా వారంరోజులపాటు కష్టపడి పనిచేస్తే బాపట్లలో నరేంద్రవర్మ, రాష్ట్రంలో చంద్రబాబునాయుడు విజయం సాధించటం తథ్యమన్నారు. అదేవిధంగా ఎంపీగా పోటీ చేసిన తెన్నేటి కృష్ణప్రసాద్‌ను కూడా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

ఆడపిల్లలు ఇంటికే పరిమితమైన రోజులలో చంద్రబాబు ప్రోద్బలంతో ప్రతి ఆడపిల్ల చదువుకొని గొప్ప స్థాయిలో ఉన్నారని తెలుగుదేశం పార్టీ ప్రొఫెషనల్ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు తేజస్విని అన్నారు. స్కూల్‌కు వెళ్ళే ఆడపిల్లలకు సైకిల్ పంపిణీ మొదలు ఇప్పుడు సూపర్‌సిక్స్ పథకాలతో 18 ఏళ్ళు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆర్థికసాయం ఇవ్వటం జరుగుతుందన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలెండర్లు అందించే ఏర్పాటు చేస్తుందన్నారు. సంకీర్ణ ప్రభుత్వంతోనే మహిళా సాధికారిత సాధ్యమని ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ సతీమణి తెన్నేటి శిరీషాకుమారి అన్నారు. రాష్ట్ర అభివృద్ధితోపాటు ప్రతిప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మానం విజేత, పట్టణ, మండల పార్టీ మహిళా అధ్యక్షులు జిట్టా ప్రమీలారాణి, కాగిత నాగభూషణమ్మ, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి హైమావతి, జనసేన నాయకురాలు గుంటుపల్లి తులసీకుమారి, డాక్టర్ గ్లోరియా నేటిసోపాటి, జి.గిరిజారాణి, వేమవరపు సుజాత, కూచిపూడి ఝాన్సీరాణి, షేక్ నజ్మా, దగ్గుమల్లి రాణి, సుజాత తదితర మహిళా నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీనాయకులు

బాపట్ల,మే 6 : మండలంలోని పడమరబాపట్ల గ్రామపంచాయతీకి చెందిన వైసీపీనాయకులు సోమవారం టీడీపీలో చేరారు. యువనాయకుడు ఆసోది నాగార్జునరెడ్డితోపాటు ఆయన తల్లి మాజీ సర్పంచ్ ఆసోది వెంకటేశ్వరమ్మలు వారి అనుచరులతో కలిసి టీడీపీలో చేరగా ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, బాపట్ల అభివృద్ధి నరేంద్రవర్మతోనే జరుగుతుందని టీడీపీలో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ ఆవుల మంద సుబ్బారావు, కావూరి రంగారావు, ఆసోది కృష్ణారెడ్డి, ఆసోది సింగారెడ్డి, భోగిరెడ్డి రామిరెడ్డి, ఆసోది వెంకటప్పారెడ్డి, డి.ఏడుకొండలురెడ్డి, ఆసోది పెద్దన్నరెడ్డి, గాంధీ, భోగిరెడ్డి నాగిరెడ్డి తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో భోగిరెడ్డి రమేష్‌రెడ్డి, అల్లం గోపికృష్ణ, జిట్టా శ్రీనివాసరావు, పెద్ది సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నాయకులు ఆసోది నాగార్జునరెడ్డి, మాజీ సర్పంచ్ ఆసోది వెంకటేశ్వరమ్మ తదితరులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నరేంద్రవర్మ

వేగేశన హరికుమారి ఇంటింటికి ప్రచారం



ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్న వేగేశన హరికుమారి

పిట్టలవానిపాలెం, మే 6 : : అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ బలపరిచి కూటమి అభ్యర్థులైన ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌లకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ సతీమణి హరికుమారి ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం మండలంలోని జీఎస్‌పాలెంగ్రామం పంచాయతీలోని వివిధ గ్రామాలలో మండల, గ్రామ టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు కార్యకర్తలతో కలిసి ఆమె ఇంటింటికెళ్ళి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాల అందజేసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేటిసోపాటి, ఖాజీపాలెం, అలకాపురం, పోతనకట్టవారిపాలెం, భవనవారిపాలెం, పిట్టువారిపాలెం, సంగుపాలెం, కోడూరు, కోమలి, చందోలు, కొత్తపాలెం, పిట్టలవానిపాలెం, మంతెనవారిపాలెం, గ్రామపంచాయతీలలో తెలుగుమహిళలు ప్రచారం నిర్వహించారు.

పేరలిలో డాక్టర్ బాలకృష్ణమూర్తి ప్రచారం

కర్లపాలెం, మే 6 : మండలంలోని పేరలి గ్రామంలో టీడీపీ నాయకుడు పేరలి బాలకృష్ణమూర్తి సోమవారం ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి నరేంద్రవర్మ, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌లకు మద్దతుగా గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాలకృష్ణమూర్తి పేరలి పంచాయతీ యాదవపాలెంలో ఇంటింటికి తిరిగి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కరపత్రాలను పంచారు. సూపర్ సిక్స్ పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏహూరి భూపతిరావు, తిరుపతిరావు (బుల్లియ్య) పాల్గొన్నారు.

నరేంద్రవర్మ గెలుపు బాపట్ల అభివృద్ధికి మలుపు

కర్లపాలెం, మే 6 : బాపట్ల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ గెలుపు బాపట్ల అభివృద్ధికి మలుపు అని పాతనందాయపాలెం టీడీపీ నాయకులు కుంచాల నాగిరెడ్డి, తంత్రి సురేష్‌లు సంయుక్తంగా అన్నారు. మండంలోని పాతనందాయపాలెంలో సోమవారం ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ గెలుపును కాంక్షిస్తూ గ్రామంలో టీడీపీ నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు.

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ 88శాతం



పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న అభ్యర్థి ఆనందబాబు

వేమూరు, మే 6: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నియోజకవర్గంలో 88శాతం జరిగింది. ఆది, సోమవారాల్లో వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్‌కేంద్రంలో ఐదు మండలాలకు చెందిన 1034మంది ఓటు వేయాల్సి ఉండగా 884మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. చుండూరు మండలపరిధిలో 124మంది, అమర్తలూరు 174 మంది, వేమూరు 134మంది, కొల్లూరు 164మంది, భట్టిప్రోలు మండల పరిధిలో 291మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటును వినియోగించుకున్నారు. రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగింది. పోలీసు లు ఓటు గుర్తుంపు కార్డు పరిశీలించిన అనంతరమే ఉద్యోగ ఓట ర్లను అనుమతించారు. కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు పోలింగ్ సరళిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జొన్నలగడ్డ విజయబాబు, నక్కా అఖిలేష్ తదితరులున్నారు.

జిల్లెళ్ళమూడి గ్రామంలో ఇళ్ళకు వైసీపీ స్టిక్కర్లు

బాపట్లరూరల్, మే 6 : బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన గృహాలపై వైసీపీ స్టిక్కర్లను గ్రామంలోని కొంతమంది వైసీపీ నాయకులు బలవంతంగా అంటించారు. గ్రామంలోని వైసీపీ కార్యకర్తలు ఇటువంటి చర్యలకు పాల్పడటంపై టీడీపీ కార్యకర్తలు, నాయకులు భగ్గుమన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా ఇటువంటి చర్యలకు వైసీపీ వారు పాల్పడటంతో అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారనే విషయం వేచి చూడాలి.

నెరవేరని ముఖ్యమంత్రి జగన్ హామీలు

● అభివృద్ధి గురించి మాట్లాడని జగన్
● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



గుళ్ళపల్లి ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, మే 6: తీరప్రాంతంలోని వెనుకబడిన నియోజకవర్గమైన రేపల్లెకు 2019 ఎన్నికల సమయంలో జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలు నేటికీ నెరవేరకపోగా రేపల్లె అభివృద్ధి గురించి మాట్లాడలేదని జగన్ ప్రసంగంలో పసలేదని ఎమ్మెల్యే అనగాని సత్యప్ర సాద్ అన్నారు. సోమవారం నగరం మండలం చిరకాలవారిపాలెం, చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి, ఆరుంబాక, చెరుకుపల్లిలో అనగాని సత్యప్రసాద్ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని



చెరుకుపల్లిలో ఎమ్మెల్యే అనగానిని గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మెల్యే అనగానికి బ్రహ్మరథం పట్టారు. అడుగడుగున హారతులు ఇచ్చి పూలవర్షం కురిపించారు. గెలిచేది టీడీపీ ప్రభుత్వమేనంటూ టీడీపీ నాయకులు నినాదాలతో మార్మోగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధం సభలో రేపల్లె నియోజకవర్గంలో రానున్న రోజుల్లో చేసే అభివృద్ధి గురించి గానీ గతంలో ఇచ్చిన హామీల గురించి గానీ జగన్‌రెడ్డి మాట్లాడకపోవటం తీరప్రాంత వాసులను అవమానపర్చటమేనన్నారు. జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఐదు సంవత్సరాలు అయన ఒక్క అడుగు కూడా ముందుకు వేసిన దాఖలాలు లేవన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు రూ.10లు ఇచ్చి రూ.100లు దోచుకుతింటున్న జగన్ మాటలు చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని సూపర్‌సిక్స్



చిరకాలవారిపాలెం ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అనగాని

పథకా ల ద్వారా ప్రజలకు మేలు జరగడంతో పాటు ఆర్థికంగా బలపడే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకు లు చింతల సుబ్బారావు, విచారపు వీరయ్య, పీవీ చింతారావు, లుక్కా గుడారంకయ్య, పూషడపు కుమారస్వామి, మల్లాది రామకృష్ణ, మొహమాటం రాధాకృష్ణమూర్తి, గూడపాటి శ్రీనివాసరావు, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, యరగళ్ళ శ్రీనివాసరావు, యరగళ్ళ మారయ్య, సూరగాని పాములు, కేసన రవీంద్ర, జనసే న నియోజకవర్గ నాయకులు మత్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సీఎం జగన్

● దళితుల ద్రోహి జగన్‌ను తరిమికొట్టాలి
● నక్కా ఆనందబాబు, తెన్నేటి కృష్ణప్రసాద్



మాజీ మంత్రి ఆనందబాబు, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌లను గజమాలతో సత్కరిస్తున్న అభి మానులు

భట్టిప్రోలు, మే 6: డ్రగ్స్, కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సైకోను తరిమికొట్టాలని రాష్ట్రాన్ని డ్రగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మార్చారని.. యువత ఆలోచన చేయాలని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌లు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రాత్రి భట్టిప్రోలు గ్రామంలో రోడ్‌షో నిర్వహించారు. రోడ్‌షోకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. మహిళలు హారతులిస్తూ దీవెనలు అందించారు. అద్దేపల్లి రామమందిరం, గ్రామదేవత అడెమ్మతల్లి ఆలయం, చర్చిలలో పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. అద్దేపల్లిలో బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఆనందబాబు, కృష్ణప్రసాద్‌లు మాట్లాడుతూ డ్రగ్స్ మాదక ద్రవ్యాలు, జే బ్రాండ్స్‌లతో వ్యాపారం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. 27 దళిత పథకాలను రద్దు చేసి దళితులను దగా చేసిన ఘనత జగన్‌రెడ్డికే దక్కుతుందన్నా రు. రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించగలిగే సత్తా నారా చంద్రబాబునాయుడుకు మాత్రమే ఉందన్నారు. రద్దు చేసిన 27దళిత పథకాలను పునరుద్ధరిస్తామని మరింతగా దళితుల అభ్యున్నతికి కట్టుబడి పని చేస్తామని హామీనిచ్చారు. అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆనందబాబు, తెన్నేటి కృష్ణప్రసాద్‌లు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, జనసేన కన్వీనర్ ఊసా రాజేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, మండల కన్వీనర్ వాకా శేషుబాబు, నాయకులు కనపర్తి సుందరరావు, యడ్ల జయశీలరావు, బట్టు మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, ఆదిన బసవపున్నయ్య, గొట్టుముక్కల లెనిన్, కనపర్తి రమేష్, కంభం సుధీర్, వంగర వీరయ్య, ఉక్కుడాల ఆనంద్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అద్దేపల్లి చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న మాజీ మంత్రి ఆనందబాబు

టీడీపీలో చేరిన ఓలేరు వైసీపీ నాయకులు..

మండలంలోని ఓలేరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామానికి చెందిన పరుచూరి వేణు, యార్లగడ్డ రజనీకాంత్, కేసన సాయిలు, ఉప్పాల వీరరాఘవులు, రేవు కోటేశ్వరరావు, కేసన చంద్రశేఖర్‌లు పార్టీలో చేరగా సోమవారం రాత్రి భట్టిప్రోలులో జరిగిన ప్రచార కార్యక్రమంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పరుచూరి రమేష్, భాస్కరరావు, వాకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న పాలనలో జీవనం సాఫీగా సాగింది

● మాజీ మంత్రి ఆనందబాబు



స్వాగతం పలుకుతున్న గ్రామ మహిళలు

చుండూరు మే 6 : చంద్రన్న పాలనలో ధరల భారం లేదు, ప్రజలు ప్రశాంతంగా జీవనం సాగించారని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. సోమవారం నడిగడ్డపాలెం, ఐనపాలెంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ ఒక్క అవకాశం అంటూ కంత్రి మాటలతో అధికారం చేపట్టిన జగన్ సంక్షేమం మాటున విచ్చలవిడి దోపిడీ సాగించాడు. సంక్షేమం పేరుతో ఎప్పుడో ఒకసారి బటన్‌నొక్కాడు. అందుకు నాలుగు రెట్లు ధరలు పెంచి ప్రజలను అడ్డంగా దోచుకున్నాడు. రైతులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించలేకపోయాడు. కనీసం ఐదు సంవత్సరాల్లో పంట కాల్వల మరమ్మతులు లేవు. సకాలంలో సాగునీరు అందక రైతులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. తుఫాన్‌తో రైతులు నష్టపోతే ఆదుకోవడానికి ముందుకు రాలేదు. విద్యావంతులైన యువత ఉపాధి లేకపోవడంతో తల్లిదండ్రులకు భారం అయ్యారని బాధను వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గం లో గతంలో తెలుగుదేశం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు తప్ప వైసీపీ చెప్పుకో తగ్గ ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టలేదన్నారు. కనీసం గ్రామీణ రోడ్లు, డొంకలు, పూర్తిగా అధ్వానంగా మారినా తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టలేదు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంకీర్ణ ప్రభుత్వంతోనే స్వర్ణాంధ్ర సాధ్యం

● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన



నరేంద్రవర్మకు అడుగడుగున హారతులు పడుతున్న మహిళలు

బాపట్ల, మే 6 : తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ చేపట్టిన ఎన్నికల ప్రచారానికి మహిళలు అడుగడుగున హారతులు పడుతున్నారు. తిలకం దిద్ది జయమనదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నరేంద్రవర్మ సోమవారం 27, 28, 29, 34 వార్డులలో పర్యటించారు. వెళ్ళిన ప్రతిచోట ప్రజలు నరేంద్రవర్మకు బ్రహ్మరథం పట్టారు. ఉత్సాహంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తరలివస్తున్న ప్రజానీకాన్ని ఉద్దేశించి నరేంద్రవర్మ మాట్లాడుతూ సంకీర్ణ ప్రభుత్వంతోనే స్వర్ణాంధ్ర సాధ్యమన్నారు. సూపర్‌సిక్స్ పథకాల ద్వారా మహిళా సాధికారితే ధ్యేయంగా మహాశక్తి పేరిట మహిళాభివృద్ధికి చేపట్టబోయే కార్యక్రమాలు గురించి వివరించారు. స్థానిక సమస్యలపై ఆయన మాట్లాడుతూ తాగునీరు, వీధిలైట్లు, మురుగుకాల్వల ప్రక్షాళన, దోమలనివారణ మొదలగు సమస్యల పరిష్కారానికి శక్తివంచనలేకుండా కృషి చేస్తానన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధికల్పన విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ప్రతి ఒక్కరికి మేలు జరుగుతుందని, బాపట్ల అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతిఒక్కరూ టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. సూపర్‌సిక్స్‌తోపాటు నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికతో తాను ముందుకెళుతానన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తెన్నేటి కృష్ణప్రసాద్‌లను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్‌లు నరాలశెట్టి ప్రకాశరావు, తోట మల్లేశ్వరి, నియోజకవర్గ గౌరవాధ్యక్షులు తోట నారాయణరావు, సీనియర్ నాయకులు మందపాటి ఆంధ్రేయ, షాకా, తాతా చినబాబు, చేజర్ల సతీష్, దగ్గుమల్లి సుబాషణరావు, నంగు ఏడుకొండలురెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, జి.గిరిజారాణి, పులి వాసు, భాస్కరరావు, ఆయా వార్డుల నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు.





ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న వేగేశన నరేంద్రవర్మ



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఎస్టీ కుటుంబాల వారికి కండు వా కప్పి స్వాగతిస్తున్న ఆనందబాబు

ఎస్టీ కుటుంబాలు టీడీపీలో చేరిక

వేమూరు, మే 6 : మండలంలోని జంపని గ్రామానికి చెందిన ఎస్టీ కులానికి చెందిన 10 కుటుంబాల వారు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. సోమవారం వారంతా వేమూరు అసెం బ్లీ కూటమి అభ్యర్థి మాజీ మంత్రి నక్కా ఆనందబాబు సమక్షం లో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ ఆనందబాబు పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. దేవరకొండ వెంకటేశ్వర్లు, గరిక చింతయ్య, గరికపాములు, గరిక సంసోను, మక్కెన కిరణ్‌రెడ్డి, వెంకట నారాయణ, రాజు, గరిక నాగమల్లేశ్వరరావు, బొడ్డు నాగరాజు, బి.వెంకట్రావు పార్టీలో చేరారు.

నేడు యాదవపాలెం, బొద్దులూరుపాడులో ఆనందబాబు ప్రచారం

కొల్లూరు, మే 6 : మండలంలో కూటమి అభ్యర్థి నక్కా ఆనం దబాబు మంగళవారం ప్రచారం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండ ల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ సోమవారం తెలిపారు. మండ ల పరిధిలోని యాదవపాలెం, బొద్దులూరుపాడు గ్రామాల్లో ఉద యం 10 గంటలకు జరిగే ఎన్నికల ప్రచారంలో ఆనందబాబు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ, జనసేన నాయకు లు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల ని కోరారు.

తీరప్రాంత అభివృద్ధికి కృషి చేస్తా : అనగాని

రేపల్లె, మే 6: తీరప్రాంత అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నగరం మండలం అల్లపర్తి సాంబయ్య ఆధ్వ ర్యంలో అల్లపర్రు గ్రామానికి చెందిన చెరుకూరి రత్నరాజు, చెరుకూరి మోహన్‌రావు, కర్రా రవి, విజయరాజు, ఏసోబ్‌లు, నిజాంప ట్నం మండలం కొత్తపాలెంనకు చెందిన మోపిదేవి సుధాకరరావు, అంద్రాజు విజయ్‌సాగర్, మోపిదేవి సుధాకరరావు, వాటుపల్లి వెంకటేశ్వరరావు, దండుప్రోలు ప్రసాద్, అంద్రాజు శ్రీరాములు, విద్యాసాగర్‌లకు ఎమ్మెల్యే అనగాని టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నూతనంగా చేరిన వారందరూ పార్టీకి అండగా నిలిచి నా విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంతాని మురళీధరరా వు, దండుప్రోలు వెంకటేశ్వరరావు, నల్లూరు అజయ్‌కుమార్, వి.సుబ్రహ్మణ్యం, దండుప్రోలు పిచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.



అల్లపర్రు వైసీపీ నాయకులకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని

కూటమి ప్రభుత్వం ద్వారా అందరికీ న్యాయం : అఖిలేష్



వేమూరు దళితవాడలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డాక్టర్ అఖిలేష్

వేమూరు, మే 6: కూటమి ప్రభుత్వం ద్వారా అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని వేమూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి నక్కా ఆనంద బాబు తనయుడు డాక్టర్ నక్కా అఖిలేష్ తెలిపారు. సోమవారం వేమూరు దళితవాడలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అఖిలేష్ ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యాపారులను, చేతి వృత్తిదారులను, రైతు కూలీలను, మహిళలను పలకరించారు. ప్రతి ఒక్కరూ చైతన్యంతో జగన్ పాలనకు బుద్ధి చెప్పాలన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవుతారని, సంక్షేమం, అభి వృద్ధి అందరికీ అందేవిధంగా నూతన ప్రణాళికలను అమల్లోకి తెస్తారన్నారు. అసెంబ్లీ కూటమి అభ్యర్థి ఆనందబాబుతో పాటు ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌లను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, ఘంటా స్వాతి, పిల్లి ఫణి, ఎలిచర్ల సురేష్, కొండా రాజా, వేమూరి రాజేష్‌శర్మ, ఎల్లమాటి కిషోర్‌కుమార్, చేడవరపు జాన్‌బెన్నూ, పిల్లి రాజశేఖర్, కొండ్రుబుల్లియ్య, వంపుగళ్ళ రాజేష్, ఈపూరి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

● ఎమ్మెల్యే సోదరి డాక్టర్ కమల అనగాని



గట్టువారిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ అనగాని కమల

రేపల్లె, మే 6: సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అనగాని సత్యప్ర సాద్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలిచి గెలుపునకు కృషి చేయాల ని ఎమ్మెల్యే సోదరి డాక్టర్ అనగాని కమల అన్నారు. నగరం మండలం గట్టువారిపాలెం, లంకమాలపల్లి, దేవరకొండవారిపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే అనగాని గెలుపు కోసం ఇంటింటా ప్రచారం డాక్టర్ అనగాని కమల నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని టీడీపీ కూటమితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్న యువతకు ఉద్యోగావకాశాల కల్పన చేయాలన్న టీడీపీ కూటమితోనే సాధ్యమవుతుందని, రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ అనగానికి అండగా నిలిచి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శొంఠి శివయ్య, ఎస్ కోటేశ్వరరావు, ఎం అంకయ్య, పి.ఫణీంద్రబాబు, ఉదయకృష్ణ, బి. సురేష్, సాగర్‌బాబు, అనగాని కుటుంబసభ్యులు రమ్య, భార్గవి, నాగలక్ష్మి, భూలక్ష్మి, ఉదయశ్రీ, భార్గవి, తుమ్మల విజయశాంతి, హైమా తదితరులు పాల్గొన్నారు.

నేడు పద్మశాలీ సంఘీయుల ఆత్మీయ సమావేశం

భట్టిప్రోలు, మే 6: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో భట్టిప్రోలు లో మండల పద్మశాలీ సంఘీయుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వ హిస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బట్టు మల్లికార్జునరావు తెలియజేశారు. స్థానిక కొత్తపేట పద్మశాలీయ కల్యాణమండపంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం కొత్తపేట పద్మశాలీయ కల్యాణ మండపంలో సంఘీయుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశానికి మాజీమంత్రి కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌లు హాజర వుతారన్నారు. మండలంలోని పద్మశాలీయ సంఘీయులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చే యాలని మల్లికార్జునరావు కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీయ సంఘీయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు, మే 6: భట్టిప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా మంగళవారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లోకి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఏడుకొండలు తెలియజేశారు. మరమ్మతులు నిర్వహిస్తున్నందున ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. కావున విద్యుత్ వినియోగదారులు సదరు విషయాన్ని గమనించి సహకరించాలని ఏడుకొండలు కోరారు.

జన కేతనం
ఆంధ్రజ్యోతి
8
బాపట్ల జిల్లా వార్తలు
మంగళవారం 7 మే 2024

మత్స్యకారులకు వలలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనగాని



అభివృద్ధికి.. అందలం

- ఆనందబాబు హయాంలో అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా భట్టిప్రోలు మండలం
- మండలంలో రూ.55 కోట్లతో అభివృద్ధి
- మారిన గ్రామాల రూపురేఖలు
- సబ్‌ప్లాన్, నరేగా నిధులతో సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం
- తాగునీటిని ఎద్దడి నివారణకు వాటర్‌ట్యాంకుల నిర్మాణం
- సీఎం సహాయనిధితో పేదల్లో భరోసా



భట్టిప్రోలు, మే6: అనుక్షణం ప్రజల సంక్షేమమే ఆయన ధ్యాస. అనునిత్యం ప్రజల సమస్యల పరిష్కారం కోసమే పరితపిస్తూ పేద బడుగు, బలహీన వర్గా ల అభ్యున్నతి కోసం శ్రమిస్తూ ప్రజల హృదయాల ను గెలుచుకున్న మాజీమంత్రి వేమూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నక్కా ఆనందబాబుకే మా ఓ ట్లు అంటూ జనం గ్రామ గ్రామాన జై కొడుతున్నా రు. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా భట్టిప్రోలు మండలా న్ని తీర్చి దిద్దారు ఆనందబాబు. మండలంలోని 15 గ్రామ పంచాయితీల్లో సుమారుగా రూ.55 కో ట్ల అభివృద్ధి జరిగింది. నాడు రాష్ట్ర మంత్రిగా నక్కా ఆనందబాబు గ్రామాలకు అందించిన స హా య సహకారాలు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలే హ్యాట్రిక్ విజయాన్ని అందిం చబోతున్నాయని గ్రామ ప్రజ లు భరోసాను వ్యక్తం చేస్తున్నారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఆనందబాబు గె లిచేందుకు అండగా నిలిచి మండల ప్రజానీకం రుణం తీర్చుకుంటానని ఇచ్చిన హా మీ మేరకు కట్టుబడి చెప్పిన పనులను చేసి చూపించారు ఆనందబాబు. మండల కేంద్రం భట్టిప్రోలు గ్రామంలో రూ.11.55కోట్లను ఖర్చుచేసి అభివృద్ధి చేయడమే కాక అత్యధికంగా వివిధ పథకాల ద్వారా 5828 మంది రూ.30.50కోట్ల లబ్ధి పొందేలా కృషి చేశారు. ఏళ్ళ తరబడి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న వితలేశ్వరనగర్ కాలనీని నివాసయోగ్యంగా మార్చి అభివృద్ధి పరచిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కింది. ఆనందబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రూ.1.74 కోట్లతో మెరకలు, సీసీ రోడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయించారు దీంతో కాలనీవాసులు గృహాలు నిర్మించుకుని నివాసం ఉంటూ ఆనందబాబుకు రుణపడి ఉంటామని కాలనీవాసులు అం టున్నారు. సబ్‌ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో దళితవాడలకే ఖర్చు చేయడంతో దళితవాడల్లోని మట్టిరో డ్లు సీసీ రోడ్లుగా నిర్మాణం జరిగాయి. బీసీ, కాపులకు కమ్యూనిటీ భవనాలు, ముస్లింలకు షాదీఖానా, డంపింగ్‌యార్డుల నిర్మాణంతో గ్రామాలు పట్టణశోభను సంతరించుకుని అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయి.



భట్టిప్రోలులో రూ.10 లక్షలతో నిర్మాణం జరిగిన డంపింగ్‌యార్డు



భట్టిప్రోలు పాండ్ రోడ్డులో రూ.30 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్

మండలంలోని ప్రతి గ్రామంలో రూ.కోటి నుంచి 4 కోట్ల వరకు నిధులు కేటాయించడం జరిగింది. మండలంలోని ఓలేరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, బస్‌షెల్టర్‌ల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణాలు రూ.6 కోట్ల తో అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్నాయి. మండలంలోని రాచూరు గ్రామంలో రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, రూ.24 ల క్షలతో వాటర్ ట్యాంకు, రూ.7 లక్షలతో అంగన్‌వాడీ భవ నం, రూ.5లక్షలతో కమ్యూనిటి భవనం నిర్మాణం జరిగాయి. పల్లెకోన గ్రామంలో మొత్తంగా రూ.4 కోట్ల నిధులు ఖర్చు చే యడం జరిగింది. రూ.1.10 కోట్లతో బేతపూడి ప్రధాన రోడ్డు నుంచి దళితవాడలకు అనుసంధానంగా ప్రధానరోడ్డు, రూ.15 లక్షలతో పంచాయితి భవనం, రూ.7 లక్షలతో అంగన్‌వాడి భ వనం, ఎస్సీ సబ్‌ప్లాన్ రూ.80 లక్షలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధు లు రూ.20 లక్షలు, సాధారణ నిధులు రూ.70 లక్షలతో దళితవాడల్లో సీసీ రోడ్ల నిర్మాణం, రూ.8లక్షలతో డంపింగ్‌యార్డు నిర్మాణం. రాచూరు పంచాయితీలో రూ.కోటితో ప్రధాన రహదారి, దళితవాడల్లో సీసీ రోడ్లు నిర్మాణం జరిగింది. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పల్లెకోనలో రూ.30లక్షలు, ఆళ్ళమూడి గ్రామంలో రూ.17లక్షలు వైద్యఖర్చుల కోసం పేద వర్గాల వారికి సాయం చేయడం జరిగింది.

దశాబ్దాల కల చింతమోటు, పెదపులివర్రు డొంకను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మంత్రి ఆనందబాబు రూ.3 కోట్లతో డొంకను తారురోడ్డుగా నిర్మాణం చేయించడంతో లంక గ్రామాల రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు. భట్టిప్రోలు వితలేశ్వరనగర్ కాలనీలో రూ.1.74 లక్షలు ఖర్చు చేసి మెరకలు, సీసీ రోడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించారు. అదే విధంగా మండలంలోని వెల్లటూరు చెన్నకేశవకాలనీకి రూ.80 లక్షలతో ప్రధాన రహదారి, రూ. కోటితో అంతర్గత రోడ్ల నిర్మాణం జరిగింది. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో అన్ని దళితవాడల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేయడం జరిగింది. మండలంలోని ఐలవరంలో రూ.90 లక్షలతో జడ్పీ రోడ్డు నిర్మాణంతో పాటుగా రూ.3కోట్లతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది. మండలంలోని పెదపులివర్రు పంచాయతీ పెదపాలెం గ్రామ ప్రధాన రహదారి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రూ.1.50 కోట్లతో ప్రధాన రహదారితో పాటుగా అంతర్గత రోడ్లు, అంగన్‌వాడీ బిల్డింగ్ నిర్మాణం చేయించారు మంత్రి ఆనందబాబు. కృష్ణానది పుష్కరాలను పురస్కరించుకుని మండలం పెదలంక కాకుల డొంక, ఓలేరు పల్లెపాలెం గ్రామాల్లో రూ.50లక్షలతో పుష్కరఘాట్‌లు, అప్రోచ్ రోడ్డుల నిర్మాణం చేపట్టారు. సంక్షేమాల సారధిగా, జనహితమే అజెండాగా పని చేసిన ఆనందబాబును అఖండ మెజార్టీతో గెలిపించేందుకు మండల ప్రజానీకం సంసిద్ధంగా ఉన్నారు.

మత్స్యకారులకు.. మేలు

- కడలి పుత్రుల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం
- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు
- ప్రగతిపథంలో రేపల్లె నియోజకవర్గం
- అనగానికే అండగా ఉంటామంటున్న మత్స్యకారులు

రేపల్లె, మే 6: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ళ కాలంలో రేపల్లె నియోజకవర్గ రూపురేఖలు మార్చిన ఘనత ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కే దక్కుతుంది. ప్రభుత్వం నుంచి నిధులు సేకరించటం, అభివృద్ధి చేయటంతో రేపల్లె నియోజకవర్గాన్ని ముందజలో నిలిపారు. తీరప్రాంతంలోని వెనుకబడిన రేపల్లె నియోజకవర్గాన్ని ఐదు సంవత్సరాల కాలంలో మూడువేల కోట్ల నిధులు వెచ్చించి అభివృద్ధి చేసి జిల్లాలోనే ఎమ్మెల్యే అనగాని ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయంచేసే విధంగా వారి గ్రామాల్లో అభివృద్ధికి నడుం బిగించారు. నియోజకవర్గంలో వివిధ రకాల అభివృద్ధి పనులకుగాను మూడు వేల కోట్లతో అభివృద్ధి, అధికారంలోకి వచ్చి 5 సంవత్సరాల కాలంలోనే నియోజకవర్గం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు.

మత్స్యకారుల అభ్యున్నతికి అనగాని చేయూత..

తుఫాన్, వరదల సమయంలో ప్రాణనష్టం కలుగకుండా ఉండేవిధంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల వ్యయంతో 12 మల్టీపర్పస్ తుఫాన్ షెల్టర్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ నిధులు మంజూరు చేయించారు. ఇప్పటికే 12 భవనాలు పూర్తిస్థాయిలో నిర్మాణాలు అయిపోగా లంకెవానిదిబ్బలో రూ.167.50 కోట్లతో నిర్మించిన తుఫాన్ షెల్టర్‌ను అప్పటి మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ప్రారంభించారు. సముద్ర తీర ప్రాంత వాసులకు ఎప్పుడు ఏ ఆపద వచ్చినా నేనున్నానంటూ ఎమ్మెల్యే అనగాని భరోసా ఇచ్చారు. రేపల్లె, నిజాంపట్నం మండలాల్లో 12 మల్టీపర్పస్ తుఫాన్ షెల్టర్లకు రూ.14 కోట్ల నిధులు మంజూరు చేసి 12 తుఫాన్ షెల్టర్లు పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేసుకున్నాయి. 16 కోట్లతో ఏడు మత్స్యకార గ్రామాలైన నిజాంపట్నం, కొత్తపాలెం, నక్షత్ర నగర్, గోకర్ణమఠం, నిజాంపట్నం ఫిషర్‌మెన్ కాలనీల్లో అంతర్గత సీసీ రహదారులను ఏర్పాటు చేశారు. రేపల్లె మండలంలోని లంకెవానిదిబ్బ జెట్టీ నిర్మాణానికి రెండున్నర కోట్లతో నిర్మాణ పనులు పూర్తిచేశారు. మత్స్యకారులకు సబ్సిడీపై వలలు, ఏరియేటర్స్, వాకీటాకీలు, ద్విచక్ర, ఫోర్‌వీల్ మినీవ్యాన్‌లు అందచేశారు. 20 కోట్లతో పెద్ద బోటు ఓనర్స్‌కు చేపల వేట చేసుకునేందుకు పెద్ద వలలను అంద జేశారు.

లంకెవానిదిబ్బలో నూతనంగా ఏర్పాటుచేసిన తుఫాన్ షెల్టరు భవనం



పూర్తిస్థాయిలో గ్రామాల అభివృద్ధి



గత మూడుదశాబ్దాల కాలంలో మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేసిన ప్రభుత్వాలు ఏమీ లేదు, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 16వేల కోట్ల రూపాయలతో ఎనిమిది మత్స్యకార గ్రామాల్లో సీసీ రహదారులు, కమ్యూనిటీ భవనాలు నిర్మించారు. తుఫాన్‌ల సమయంలో సముద్రతీర ప్రాంత మత్స్యకారులకు ప్రాణరక్షణ కల్పించేందుకు 12 మల్టీ తుఫాన్ షెల్టర్లను నిర్మించారు. రానున్న ఎన్నికల్లో తాము చంద్రబాబుకు అండగా నిలుస్తామన్నారు.

- కొపనాతి రాజశేఖర్, లంకేవానిదిబ్బ, మత్స్యకార సంఘ నాయకులు

టీడీపీతోనే మత్స్యకారుల అభ్యున్నతి



తీరప్రాంతంలోని మత్స్యకారుల అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కోట్లాది రూపాయల నిధులు వెచ్చించింది. సబ్సిడీపై వలలు, బోట్లను, మరబోట్లను, ఐస్‌బాక్సులను మత్స్యసంపదను అమ్ముకునేందుకు ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను సబ్సిడీపై అందించారు. గత ప్రభుత్వాలు మాటలు చెప్పాయే తప్ప పనులు చేయలేదని, టీడీపీ హయాంలోనే మత్స్యకారుల అభివృద్ధి జరిగింది.

- పంతాని మురళీధరరావు, టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి

50 ఏళ్ళకే మత్స్యకారులకు పెన్షన్‌లు



మత్స్యకార గ్రామాల్లో మత్స్యకారులకు 50 సంవత్సరాలకే పెన్షన్‌లు మంజూరుచేసి ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుంది. సముద్రతీర ప్రాంతంలో ఉన్న మత్స్యకారులకు పక్కా భవనాలు లేక ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్న తరుణంలో ఎన్టీఆర్ గృహకల్ప ద్వారా 500 గృహాలను మంజూరుచేసి నిర్మించారు. మత్స్యకారులకు ప్రభుత్వం ఇస్తున్నదానికి అదనంగా రూ.75వేలు ఇచ్చిన ఘనత టీడీపీదేనన్నారు. మత్స్యకారుల అభ్యున్నతికి కృషిచేసిన ఎమ్మెల్యే అనగానికి జీవితాంతం అండగా నిలుస్తాం.

- దండుప్రోలు వెంకటేశ్వరరావు, కొత్తపాలెం గ్రామం, మత్స్యకార నాయకులు

ఎన్నికల ప్రచారంలో ఓటర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ



బాపట్లలో.. నూతనోత్సాహం

- ఊపందుకున్న నరేంద్రవర్మ ప్రచారం
- బ్రహ్మరథం పడుతున్న ప్రజానీకం

బాపట్ల, మే 6: ఎన్నికల సమయం దగ్గర పడటంతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ ప్రచారం ఊపందుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాడవాడలా, గ్రామగ్రామాన ప్రచారం పెద్దఎత్తున చేస్తున్నారు. ప్రచారం దూకుడు పెంచిన నరేంద్రవర్మకు మద్దతుగా యువతరం కేరింతలుకొడుతున్నారు. ప్రచారంలో పాల్గొని మద్దతు తెలియజేస్తున్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ఎన్నికల ప్రచారాన్ని అనుసరిస్తున్నారు. దీంతో పార్టీశ్రేణులలో ఉత్సాహం తారాస్థాయికి చేరుకుంది. నాలుగు పర్యాయాలుగా ఓటమి చవిచూచిన తెలుగుదేశంపార్టీ ఈసారి విజయం సొంతం చేసుకోవాలనే పట్టుదలతో పనిచేస్తున్నారు. నాయకులు,కార్యకర్తలు, మహిళలు తమదైన శైలిలో ప్రచారంలో దూసుకుపోతున్నారు. నరేంద్రవర్మకు మద్దతు కూడగడుతున్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారు సైతం పెద్దఎత్తున ఎన్నికల ప్రచారంలో పాల్గొని తమ అనుచరులు టీడీపీని గెలిపించాలంటూ కృషి చేయాలని కోరుతున్నారు. ప్రతిఒక్కరు సైకిల్‌కు ఓటు వేసి తనతోపాటు ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌లను గెలిపించాలని నరేంద్రవర్మ కోరుతున్నారు. దీనికి యువత, వృద్దులు, మహిళలు ఆయనకు మద్దతు తెలియజేస్తున్నారు. సైకిల్ గుర్తుకు ఓటు అభివృద్ధికి చోటు అంటూ ప్రచారపర్వం ముందుకు సాగుతున్నది. ఎండను సైతం లెక్కచేయకుండా నరేంద్రవర్మ గెలుపు కోసం ప్రజలు రోడ్డు మీదకొచ్చి మద్దతు తెలియజేస్తున్నారు. పార్టీశ్రేణులలలో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నారు. ప్రజా శ్రేయస్సు కొరుకునే నరేంద్రవర్మ గెలుపు తమకు ముఖ్యమంటూ నాయకులు అడుగులు వేస్తున్నారు. ప్రతిచోట ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. బాపట్ల ప్రగతికి తానేమి చేయబోతున్నాడో వివరిస్తూ వినూత్న రీతిలో నరేంద్రవర్మ ప్రచారపర్వం కొనసాగుతున్నది. వ్యాపారవేత్తగా, పారిశ్రామికవేత్తగా సమాజ సేవకునిగా ప్రతి ఇంటికి తెలిసిన వ్యక్తిగా నరేంద్రవర్మ చేస్తున్న విజ్ఞప్తిని ప్రజలు సంతోషంగా స్వీకరించి గెలిపిస్తామని భరోసానిస్తున్నారు. నిరుపేదల ఆకలి తీరుస్తూ కష్టాల్లో ఆదుకుంటున్న నరేంద్రవర్మకు ప్రజలు పెద్దఎత్తున మద్దతు తెలియజేయటంతో బాపట్లలో టీడీపీ బావుటా ఎగురవేయటం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు.



నరేంద్రవర్మ ప్రచారానికి పెద్దఎత్తున తరలి వచ్చిన నాయకులు,కార్యకర్తలు, అభిమానులు

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- పోలింగ్ తీరును పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి



బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా



ఓటు వేసేందుకు బారులు తీరిన ఉద్యోగులు

బాపట్ల, మే 6: ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవో, ఏపీవోలకు సోమవారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగింది. రెండో రోజు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా సోమవారం పరిశీలిం చారు. ఆర్వో జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్‌ను పోలింగ్ వివరాలు అడిగి, పలుసూచనలు చేశారు. ఈ కేంద్రంలో మొత్తం 387మంది ఓటుహక్కు వినియోగించుకోవాల్సి ఉండగా 360మంది ఓటు వేశారు.

సమస్యాత్మక కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత

జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. పిట్టలవానిపాలెం మండలం చందోలు, కర్లపాలెం గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. గత ఎన్నికల్లో పరిస్థితులు, ఘటనలపై ఆరా తీశారు. స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఓటర్లకు సూచించారు. పోలింగ్ రోజు వెబ్ క్యాస్టింగ్, వీడియోగ్రఫి చేపట్టాలని అధికారులకు సూచించారు. సమస్యాత్మక కేంద్రాలపై సూక్ష్మపరిశీలకుల నిఘా ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ కె.స్ఫూర్తి కలెక్టర్ వెంట ఉన్నారు. అనంతరం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించారు. నియోజకవర్గాల వారీగా ఏర్పాటైన రూమ్‌లు, వాటి వద్ద ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు, వెబ్‌క్యాస్టింగ్ పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, సబ్‌కలెక్టర్ లక్ష్మీకుమారి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

గోతులు.. ప్రమాదాలు

- తీరంలో అధ్వానంగా రహదారులు
- ఐదేళ్లుగా తట్టమట్టి పోసిన దాఖలాలు లేవు

మంత్రిపాలెం అడవులదీవి మధ్యలో ఆర్‌అండ్‌బీ రహదారి కోతకు గురై ప్రమాదభరితంగా ఉన్న దృశ్యం



రేపల్లె, మే 6: తీరంలో రోడ్లు గుంతలతో నిండిపోయాయి. గోతుల కారణంగా నిత్యం వాహనచోదకులకు గురవుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లుగా కనీసం గోతుల్లో తట్టమట్టి వేసిన దాఖలాలు లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజాంపట్నం మండలం మంత్రిపాలెం నుంచి గురున్నాథనగర్, అడవులదీవి, పల్లపట్ల, కూచినపూడి నుంచి అడవులదీవికి వెళ్లే ప్రధాన రహదారి, అడవులదీవి నుంచి నక్షత్రనగర్, కొత్తపాలెం, దిండి గ్రామాలకు వెళ్లే రహదారులు భారీ గోతులతో ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలతో పాటు రైతులు అత్యంత కష్టంగా ఈ రహదారులపై రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారులు అధ్వానంగా ఉండటంతో ఆర్టీసీ బస్సులు కూడా నామమాత్రంగానే తిరుగుతున్నాయి. అడుగడుగున గోతులతో రోడ్లు ఛిద్రమైనాయని ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మత్తులకు నిధులు రానిదే తాము ఏమి చేయగలమని ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్తున్నారు.



గుర్నాథనగర్ సమీపంలో గుంతలమయంగా మారిన రహదారి

అడవులదీవి సమీపంలో గుంతలమయంగా మారిన రహదారి



వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

- ఓటుతో జగన్‌రెడ్డికి బుద్ధి చెప్పండి
- ల్యాండ్ టైటిల్‌తో రైతులకు ముప్పు
- సూపర్‌సిక్స్‌తో అన్నివర్గాలకు లబ్ధి
- కూకట్లపల్లి, కొత్తూరు ప్రచారంలో

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి రవికుమార్

బల్లికురవ, మే 6 : ఐదేళ్ల కిందట అభివృద్ధి బాటపట్టిన రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన వైసీపీ పార్టీకి ప్రజలు ఓటు ద్వారా ఈ ఎన్నికలలో బుద్ధి చెప్పాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కొత్తూరు అనుణగిరి తండా, కూకట్లపల్లి యానాది సంఘం కాలనీలో ఎమ్మెల్యే రవికుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగు నీరు వసతి కల్పించడంతో పాటు ప్రతి ఒక్కరికీ నివేశన స్థలాలు అందజేస్తామన్నారు. అలానే మురుగు కాలువల నిర్మాణం చేపడతామన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు చూసి ప్రజలు సైకిల్ గుర్తుపై ఓట్లు వేయాలని ఆయన కోరారు. అనంతరం ఆయన వారితో మా ట్లాడుతూ వైకాపాకు ఒక్క చాన్స్ ఇస్తే వారు అన్ని వర్గాల ప్రజలను తీవ్రంగా మోసం చేశారని ఆయన ధ్వజమెత్తారు. ఎన్నికలలో ఇచ్చన హామీలను అమలు చేయడం చేత కాని జగన్‌రెడ్డి మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు రోజుకో ఎత్తులు వేస్తున్నారన్నారు. ప్రజలు వారి మాటలు నమ్మవద్దు అని ఆయన అన్నారు. ఈ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిల్ చట్టంతో రైతుల భూముల మీద రైతులకు హక్కులు ఉండవన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే టైటిల్ చట్టాన్ని రద్దు చేస్తామన్నారు. అలానే నిరుద్యోగులకు మెగా డీఎస్సీపై తొలి సంతకాన్ని చంద్రబాబు చేస్తారన్నారు. మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడంతో పాటు 59 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500 ఇవ్వడంతో పాటు తల్లికి వందనంపేరుతో ఇంట్లో ఎంత మంది విద్యార్థులున్నా అందరికీ రూ.15వేల వంతున చెల్లిస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు ఏడాదికి రూ.20వేల పెట్టుబడి సాయం బీసీలకు 50ఏళ్లకే పింఛన్ అందిస్తామని సామాజిక పింఛన్ ఇకపై రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు అందిస్తామన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3వేల వంతున నిరుద్యోగ భృతి చెల్లిస్తామన్నారు. ఉచిత ఇసుక విధానం తెస్తామని ప్రజలందరూ ఎమ్మెల్యేగా గొట్టిపాటిని, బాపట్ల ఎంపీగా కృష్ణ ప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఇప్పల అంజిరెడ్డి, పెం ట్రాల అంజనేయులు, దొడ్డా వేణుగోపాల్, శ్రీనివాసరావు, రామకోటేశ్వరరావు, ముంద్రు దానయ్య, పాపసాని రాఘవ, కల్లూరి రమేష్, అబ్రహం పాల్గొన్నారు.



కూకట్లపల్లిలో ఎస్సీ మహిళలతో మాట్లాడుతున్న గొట్టిపాటి

వైసీపీ పాలనలో దళితులకు అన్యాయం

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకి, మే 6 : వైసీపీ ప్రభుత్వ పాలనలో దళితులకు తీరని అన్యాయం జరిగిందని టీడీపీ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఉదయం అద్దంకి పట్టణంలోని 3 వ వార్డులో రవికుమార్ ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై అసాంఘిక శక్తులు, వైసీపీ మూకలు దాడులు చేస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో 6 వేలకు పైగా దాడులు, 158 మందిని హత్య చేశారన్నారు. 27 సంక్షేమ పథకాలను రద్దు చేశారన్నారు. జగన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోనే నాగమ్మ అనే మహిళపై అత్యాచారం చేసి హత్య చేసినా నిందితులను శిక్షించలేకపోయారన్నారు. టీడీపీ పాలనలోనే ఎస్సీల సంక్షేమం జరుగుతుందన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్యా పథకం ద్వారా ఎస్సీ పేద విద్యార్థులకు విదేశాల్లో గొప్పగొప్ప చదువులు చదివించిన ఘనత టీడీపీదే అన్నారు. బాబు పాలనలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఆదుకున్నారన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ ద్వారా ఎస్సీ విద్యార్థులకు కార్పొరేట్ విద్యను ఉచితంగా అందించామన్నారు. ఎస్సీలకు ప్రమోషన్‌లలో రిజర్వేషన్ అమలు చేశామన్నారు. ఎస్సీలకు భూమి కొనుగోలు పథకం కింద 2386 ఎకరాలు మంజూరు చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని అమలు చేయడానికి సత్వర న్యాయం చేయడానికి జిల్లాకొక మొబైల్ కోర్టును ఏర్పాటు చేస్తామన్నారు. దేశ చరిత్రలోనే మొదటి సారి ఎస్సీ రైతులకు 90 శాతం సబ్సిడీ పథకాలను టీడీపీ ప్రవేశ పెట్టిందన్నారు. ఎస్సీ పేద విద్యార్థులకు నూరుశాతం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందజేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని రవికుమార్ అన్నారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి గొట్టిపాటి పూలమాలవేసి నివాళులర్పించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కాకాని అశోక్, బొడ్డపాటి రవిబాబు, సందిరెడ్డి శ్రీనివాసరావు, గోవాడ శ్రీకాంత్, బొజంకు నాగరాజు పాల్గొన్నారు.



10వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న హర్షవర్ధన్

టీడీపీతోనే అన్నివర్గాల సంక్షేమం

హర్షవర్ధన్ ఇంటింటి ప్రచారం

అద్దంకి, మే 6 : అన్ని వర్గాల ప్రజల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని గొట్టిపాటి హర్షవర్ధన్ అన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ విజయాన్ని కాంక్షిస్తూ తనయుడు హర్షవర్ధన్ సోమవారం రాత్రి అద్దంకి పట్టణంలోని 10వ వార్డులో ప్రచారం నిర్వహించారు. హర్షవర్ధన్ ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను ఓటర్లకు వివరించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో డీఎస్సీ లేక, పరిశ్రమలు రాక నిరుద్యోగులు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారన్నారు. రకరకాల చెత్త పన్నులతో పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచిన తుగ్లక్ జగన్ అన్నారు. పట్టణంలో టీడీపీ హయాంలో రూ.85 కోట్లతో ప్రారంభించిన మంచి నీటి పథకాన్ని పూర్తిచేయలేని చేతగాని పాలకులు వైసీపీవారన్నారు. అభివృద్ధి కావాలంటే కూటమి జట్టుకు జై కొట్టాలన్నారు. ఎమ్మెల్యేగా గొట్టిపాటిని, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుందారపు రామారావు, ధర్మవరపు నాగేశ్వరరావు, గార్లపాటి శ్రీనివాసరావు, వీరనారాయణ, పీసీహెచ్ కోటయ్య, శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఛైర్మన్ నర్రావుల కొండలు, పూనూరి నరేంద్ర, కరి రవి, నాయుడు, కరి సతీష్, శర్మ, చెన్నా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాం ట్రస్ట్ బోర్డు మాజీ డైరెక్టర్ చెన్నా వెంకటేశ్వర్లు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ చెన్నా విజయలక్ష్మి దంపతులు సోమవారం రాత్రి గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ సమక్షం లో టీడీపీలో చేరారు.

టీడీపీలోకి వలసల జోరు

వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్న కొండయ్య

వేటపాలెం(చీరాల), మే 6 : ఎన్నికల వేళ టీడీపీలోకి చేరే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. అందులో భాగంగా మండల పరిధిలోని అక్కాయిపాలెంలో సోమవారం పలువురు నాయకులు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇతర పార్టీల నుంచి టీడీపీలోకి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు చేరారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలు అభ్యున్నతి సాధ్యమన్నారు. అందుకు అనుగుణంగా టీడీపీకి ఆదరణ పెరుగుతోందన్నారు. సోమవారం పలు ప్రాంతాలకు చెందినవారు పార్టీ కార్యాలయం లో కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువాలు వేసి కొండయ్య సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో పార్టీలకు అతీతంగా కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కార్యోన్ముఖులు కావాలన్నారు.



కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలు



ప్రచారం చేస్తున్న కొండయ్య కుమార్తె శివనారాయణదేవి

గెలుపు మనదే .. అశ్రద్ధ వద్దు

రానున్న ఎన్నికలలో గెలపు మనదే. అయితే అశ్రద్ధ వద్దని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య అన్నారు. మున్సిపల్ పరిధిలోని 16, 17, 18, 21 వార్డులలో కొండయ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ కూటమి మేనిఫెస్టోతో ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. తాజాగా నెలకొన్న పరిస్థితులు, అందుకు అనుగుణంగా పార్టీ శ్రేణులు వేయాల్సిన అడుగులుపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం అయితేనే సమస్యలకు పరిష్కారం

రాష్ట్రంలో నెలకొన్న సమస్యల పరిష్కారంకు చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావడం ఒక్కటే మార్గమని టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్య కుమార్తె శివనారాయణదేవి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆమె నాయకులు, కార్యర్తలతో కలసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ కూటమి గెలుపుకు ఎమ్మెల్యేగా తన తండ్రి కొండయ్యను, ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు, రేపు హోం ఓటింగ్

చీరాల, మే 6 : హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నవారు మంగళ, బుధ వారాల్లో ఇంటి వద్దనే తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ఆర్డీవో, ఈఆర్వో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. హోం ఓటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు ఆరు టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఈ నేపథ్యంలో హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న ఓటర్లు మంగళ, బుధ వారాల్లో ఇంటి వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు. కావున అవకాశాన్ని హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పర్చూరు ఉప విద్యాశాఖాధికారిగా నిర్మల

పర్చూరు, మే 6 : పర్చూరు ఉప విద్యాశాఖాధికారిగా ఎం.నిర్మల సోమవారం బాధ్యతలు చేపట్టారు. బాపట్ల జిల్లా వలపర్ల జిల్లా తెనాలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై పర్చూరు వచ్చారు. గతంలో ఈమె వలపర్ల జడ్పీ పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయునిగా పనిచేశారు. నిర్మలకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాలి

వేటపాలెం(చీరాల), మే 6 : రాష్ట్రం పురోగమనంలో సాగాలంటే చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాల్సిందేనని టీడీపీ నేతలు సజ్జా వెంకటేశ్వరరావు, డాక్టర్ సజ్జా హేమలత అన్నారు. వేటపాలెంలో సోమవారం వారు నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటి ప్రచా రం నిర్వహించారు. ప్రధానంగా ఎన్నికల మ్యానిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్‌పై అవగాహన కల్పిస్తూ ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండయ్య, ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌లకు సైకిల్ గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు

చేనేతలకు టీడీపీతోనే పురోగతి

చేనేతలకు టీడీపీతోనే పురోగతి సాధ్యమని ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ అన్నారు. చీరాల మండలం దేవాంగపురిలో సోమవారం నిర్వహించిన చేనేతల ఆత్మీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే నేతన్నలకు ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితులను మోసగించిన జగన్‌ను ఓడిద్దాం

సంతమాగులూరు, మే 6 : దళితులను మోసగించిన జగన్‌రెడ్డిని ఓడిద్దామని టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వలపర్ల సుబ్బారావు పిలుపునిచ్చారు. బండివారిపా లెం, గురిజేపల్లి, తంగేడుమల్లి, మినెకల్లు గ్రా మాల్లో సోమవారం ప్రచారం నిర్వహిం చారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. దళితుల ఓట్లతో గెలిచిన జగన్‌రెడ్డి దళితులను నిలువునా మోసగించారన్నారు. టీడీపీ పాలనలో అనేక పథకాలతో దళితులు లబ్ధిపొందారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులను దారిమళ్లించి జగన్‌రెడ్డి దళితుల సంక్షేమానికి తూట్లు పొడిచారన్నారు. కార్యక్రమంలో అమోస్, రాధాకృష్ణమూర్తి, రేణింగవరం మాజీ సర్పంచి అమర్తపూడి ఏసోబు (చిన్న), పాత మాగులురు సర్పంచి విజయబాబు, రమేష్ పాల్గొన్నారు.



బండివారిపాలెంలో ప్రచారం చేస్తున్న శ్రేణులు